

APTEL/26/A2902

గ్లోబల్ వార్త

తెలుగు దినపత్రిక



సంపుటి : 01 | సంచిక : 69 | 31 - 10 - 2026 | శనివారం | పేజీలు : 10 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada

ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు ముగిసిన ప్రచారం..ఎల్లుండే పోలింగ్



అమరావతి, అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి శుక్రవారం సాయంత్రంతో తెరపడింది. గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన మైకులు,

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది : నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి

వీధుల్లో కాదు..పార్లమెంటులో తేల్చుకుందాం రండి!

పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు రెడీ : అమిత్ షా



న్యూఢిల్లీ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : ఓట్ల దొంగతనం ఆరోపణలపై పార్లమెంటులో చర్చించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. అయితే ఈ చర్చకు కాంగ్రెస్ అగ్రనేత



అండమాన్ సముద్రంలో అల్పపీడనం

ఏపీ తీరం వైపు పయనం!

అమరావతి, అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ అలజడి మొదలైంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాయుగుండం ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే సూచనలు కనిపిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, నిన్న దక్షిణ అండమాన్ సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం, శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయానికి మరింత స్పష్టంగా రూపుదిద్దుకుని, దక్షిణ అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా

చివరి బాధితుడికి సాయం అందే వరకు

విశ్రమించేది లేదు : సీఎం

- అర్నబ్ తుపానుతో ఏపీ అతలాకుతలం
- యుద్ధప్రాతిపదికన విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణ పనులు
- దాదాపు 3.5 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టం
- క్షేత్రస్థాయి సిబ్బందితో నేరుగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేస్తున్న ముఖ్యమంత్రి



అమరావతి, అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : అర్నబ్ తుపాను సృష్టించిన విలయం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. "తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సహాయం అందేంత వరకు, ప్రతి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నేను విశ్రమించను" అని ఆయన స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఇదే సంకల్పంతో పనిచేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత నాలుగు రోజులుగా టెలీకాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, క్షేత్ర స్థాయి పర్యటనలతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇవాళ పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ప్రాంతంలో రెండో రోజు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ముందు కూడా ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలో సాధించిన పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ పనుల పురోగతిని తెలుసుకుంటుండటంతో, యంత్రాంగం మొత్తం యుద్ధప్రాతిపదికన పనిచేస్తోంది.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

తుపాను కారణంగా అతలాకుతలమైన వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టేందుకు వివిధ శాఖలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన 5,404 గ్రామాలకు గాను, శుక్రవారం ఉదయం 10 గంటల నాటికి 4,881 గ్రామాలకు (దాదాపు 90%) విద్యుత్‌ను పునరుద్ధరించారు. దెబ్బతిన్న 552 సబ్‌స్టేషన్లలో 513 (93%) తిరిగి పనిచేయడం ప్రారంభించాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి,

10 లో



ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం చేయండి

తుపాను సహాయక చర్యలపై పవన్ సమీక్ష

అమరావతి, అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : 'అర్నబ్' తుపాను కారణంగా కాకినాడ జిల్లాలో జరిగిన నష్టంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు, మత్స్యకారులు, రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారుల బోట్లకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దీపావళి తర్వాత తాను స్వయంగా మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో

తుఫాన్ బీభత్సం..విద్యుత్ శాఖకు భారీ నష్టం



- తుఫాన్ దెబ్బకు విద్యుత్ వ్యవస్థ అతలాకుతలం
- 8 వేల విద్యుత్ స్తంభాలు నేలమట్టం.. 36 సబ్‌స్టేషన్లు ధ్వంసం
- మున్సిపాలిటీలకు ఈ రాత్రికే 100 శాతం విద్యుత్ పునరుద్ధరణ లక్ష్యం

అమలాపురం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : భారీ తుఫాన్ ప్రభావంతో విద్యుత్ శాఖకు ఊహించని నష్టం వాటిల్లిందని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమలాపురంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ తుఫాన్ వచ్చినప్పటికీ ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాలను చాలా వరకు నివారించగలిగామని మంత్రి పేర్కొన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తుఫాన్ హెచ్చరికలు వెలువడినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించారని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని వివరించారు. తుఫాన్ కారణంగా విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, 36 సబ్‌స్టేషన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని వెల్లడించారు. అవసరమైన మ్యాన్‌పవర్, విద్యుత్ సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా పనులకు ఆటంకాలు కలుగుతున్నాయని చెప్పారు.



పులివెందులలో నామినేషన్లు వేసుకోలేకపోయారు

చొక్కా మడత పెడతారా? : దేవినేని ఉమా

అమరావతి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : "చొక్కా మడతపెట్టి 2.0 అంటూ మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి, సొంత నియోజకవర్గం పులివెందులలోనే 65 ఎంపీటీసీ స్థానాలకు గాను 64 చోట్ల నామినేషన్లు వేయలేని దుస్థితిలో ఉన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు చొక్కా మడతపెడతానని మాట్లాడటం సిగ్గుచేటు" అని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. తాడేపల్లిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో

గోదావరి జలాలతో

ఉత్తరాంధ్రకు కొత్త ఆశలు

- పాయకరావుపేట అభివృద్ధికి పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో పెద్దపీట!
- పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

అమరావతి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న నమ్మకం, ఆదరణ, అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజల సహకారంతో గత రెండున్నరేళ్లుగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో పాయకరావుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ హోంమంత్రి విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో పలు అంశాలను ప్రస్తావించారు. ఉత్తరాంధ్ర ముఖద్వారంగా ఉన్న పాయకరావుపేట నియోజకవర్గం పారిశ్రామికంగా



అభివృద్ధి చెందుతోందని అనిత తెలిపారు. నక్కపల్లిలో ఏఎంఎన్ఎస్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్, టాయ్ పార్క్ వంటి పరిశ్రమల ఏర్పాటుతో

APTEL/26/A2902


గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

ఆధునిక యుగపు ప్రాచీన కథకుడు

రాయడం మొదలుపెట్టిన కొత్తలో నాకో సమస్య ఎదురైంది: ఎలా రాయాలి? అంటే పేపర్ మీద చేత్తో రాయాలా? లేక కంప్యూటర్‌లో టైప్ చెయ్యాలా? ఆలోచనా ప్రవాహాన్ని అక్షరాల్లోకి మార్చి లిపిబద్ధం చేసే ఆ ప్రక్రియకి చేతిరాత సులువా? టైపింగ్ సులువా? -- ఇవన్నీ ఈరోజుకీ, అంటే మూడు నవలలు రాసి ప్రచురించిన తర్వాత కూడా, నాకు అప్పుడప్పుడూ వచ్చే ఆలోచనలు. పేపర్ వాడకం మన దేశంలో మొదలవడానికి ముందు, అందంగా కత్తిరించుకున్న తాటాకుల మీద రాసేవాళ్ళని మనకి తెలుసు. అప్పట్లో కావ్యాలూ, ప్రబంధాలూ కవులు తమ శిష్యులకి చెప్తుంటే, శిష్యులు ఆ వాగ్ధారని అంతే వేగంగా గంటంతో తాటాకుల మీద అక్షరాలుగా రాసేవాళ్ళు. మరి వాటికి కాపీలు తీయాలంటే? కొందరు నెత్తిన తాటాకుల పుస్తకాలు పట్టుకుని ఊర్లు తిరుగుతూ, ఇళ్లలో పాడైన పాత గ్రంథాలు ఏవైనా ఉంటే ప్రతులు రాసి పెడతాం అనేవాళ్ళంట. వాళ్ళని వ్రాయసకాళ్ళు అనేవాళు ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెప్తున్నా అంటే, విశ్వనాథ సత్యనారాయణ గారు తన రచనలన్నీ ఎవరికో నెరేట్ చేస్తుంటే, వాళ్ళు రాసినవేనట. అంటే మన ప్రాచీన కవుల పద్ధతి అన్నమాట. కొంతకాలంగా విశ్వనాథ నవలలు వరసగా చదువుతున్నాను. వందా రెండువందల పేజీల నవలలే కాదు, 'వేయి పడగలు' లాంటి మహా ఉద్గ్రంథాలను మనసులో అక్షరీకరించి, నోటితో చెప్తుంటే ఎవరో రాసిపెట్టడం అనే ఆ ప్రాచీన ప్రక్రియ నేటి '+వఙ్గ' రచయితగా నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన రచనలు చదువుతుంటే ఆయన ఆ తిక్కన, ఎర్రన, పోతన్న, పెద్దన్న పరంపరలోనివారే అనిపించింది. (ఆధునిక యుగపు ప్రాచీన కథకుడు). వర్తమానంలో విశ్వనాథ స్థానం ఏమిటి అన్నదానికి ఉదాహరణ, ఈమధ్య రచయిత్రి అపర్ణ తోట సంపాదకత్వంలో వచ్చిన 'అదే ప్రేమ' అనే క్వియర్ కథా సంకలనంలో మొదటి కథ ఆయన రాసిన 'భావనాసిద్ధి' కావడం. కథ మొదలుపెట్టడానికి ఒక ఎత్తుగడ కావాలి. పాఠకుడిని హుక్ చేసే ఒక ట్రిక్-- ఒక సంఘటన, ఒక వాక్యం, ఒక దృశ్యం, ఇలా ఏదైనా... విశ్వనాథ వారి నవలల్లో ఇప్పటిదాకా నేను చదివిన 'హ హ హు హు', 'మిహిరకులుడు', 'పులిమ్రుగ్గు', 'చెలియలికట్ట', 'బాణావతి' నవలల్లో అది క్లియర్‌గా కనిపిస్తుంది. లండన్ ట్రఫాల్గర్ స్క్వేర్‌లో రెక్కలుతెగి పడిన ఓ గంధర్వుడు కావొచ్చు; విద్య నేర్పిన గురువుగారితో తనలోని శాడిజమ్‌ను వివరించే రాకుమారుడు కావొచ్చు; ముందుకాళ్ళు పులివి, వెనకాళ్లు మనిషివి అయిన ఓ విచిత్ర జీవిని అన్వేషించడం కావచ్చు -- అన్నీ అద్భుతమైన ఎత్తుగడలు. (ఆయనకి ఇంగ్లీషు సినిమాలు చూసే అలవాటు ఉందని ఎవరో చెప్పారు. బహుశా, వాటి ప్రభావం కొంత ఉందేమో.) తెలుగు సాహిత్యం మీద ఆసక్తి ఉన్నవాళ్ళు కచ్చితంగా చదవాల్సిన రచన 'హ హ హు హు'. అది చదువున్నప్పుడు అక్కడక్కడా జోనథన్ స్విఫ్ట్ 'గలివర్ ట్రావెల్స్' గుర్తొచ్చింది. అలాగే ఇంగ్లీష్ ఏనిమేషన్ కామెడీ సిరీస్ 'బోజాక్ హార్స్‌మ్యాన్' కూడా గుర్తొచ్చింది. అందులో కూడా గుర్రం తలతో ఉండే ఒక మనిషి క్యారెక్టర్ ఉంటుంది. ఈ నవలలోనూ ఒకచోట ష్వశీతీంవ ఘ్మఅ అనే మాట వస్తుంది. కొంతకాలం క్రితం 'హ హ హు హు'ను వెల్చేరు నారాయణరావు ఇంగ్లీషులో అనువాదం చేశారు. దీని తర్వాత నేను చదివిన నవల 'మిహిరకులుడు'. ఇంత భీకర బీభత్స జుగుప్సాకరమైన కథని ఒక ఛాందస సనాతన సంప్రదాయవాది, ఊహించి రాశాడా అనే ఆలోచనతో ఆశ్చర్యపోతూ చదివాను. ఇప్పుడు మనం సినిమాల్లో ట్రెండ్ లాగా చూస్తున్న స్త్రశీతీఎ ఖఖ్ఱశీఅ ఎతీఘఎ లాంటి కథని ఆయన ఆ కాలంలోనే ఊహించి రాయడం, చదువుతూ ఆయన్ను నిందాస్తుతి చేస్తూనే ఉన్నాను. మధ్యమధ్య కొన్ని వాక్యాలు చాలా నచ్చాయి. ఉదాహరణకు, "మానవుని యొక్క మనస్సు పుండువంటిది. పుండు మానినట్లుండును. లోన పచ్చిగానే యుండును. నిముసములో మరల పుండగును. లేదా లోన సలపరింత యుండును. అందుచేత క్రొత్తక్రూరకర్మ కలిగినపుడు వ్యాధి తిరుగ బెట్టినట్లుండును." విశ్వనాథ నేపాల రాజవంశ నవలలు, కాశ్మీర రాజవంశ నవలలు పేరుతో కొన్ని వరస నవలలు రాసారు. నేను చదివిన తర్వాతి నవల 'పులిమ్రుగ్గు' మగధ రాజవంశ నవలల్లోనిది. కానీ వీటికి ఆయన పురాణ వైరి గ్రంథమాల అని పేరు పెట్టారు. ఈ సిరీస్‌లో 12 నవలలు రాసారు. పురాణవైరి గ్రంథమాలలో, ఎనిమిదవ నవల 'పులిమ్రుగ్గు'. ఈ నవల చదివిన తర్వాత నాకు అనిపించింది ఏంటంటే వీటిని చారిత్రక నవలలుగా అస్సలు పరిగణించకూడదు. చారిత్రక వ్యక్తుల పేర్లు పెట్టి తనకి నచ్చిన కథ రాసుకున్నారాయన. అచ్చంగా మధిర సుబ్బన్న దీక్షితులు కాశీమజిలీ కథల్లాగే. వాటిని ఎలా చదువుతామో, వీటిని కూడా అలాగే చదవాలి. ఈ కథలో నాకు బాగా నచ్చింది. ఆయన ఊహాశక్తి. అలాగే మనిషిలో ఉండే అనేక వికారాలు, విపరీతాలు, వాసనలు ఆయన పైపైనే అయినా ముట్టుకునే ప్రయత్నం చేశారు. మనిషికి ఉండే అనేక వికారాలలో ఖఅఅఘ్మిశ్రీ టవీఅంష్ట ఒకటి. దానిని ఈ నవలలో ప్రధానాంశంగా తీసుకోవడం, కథని ఒక థ్రిల్లర్ లాగా నడిపించడం ఈ నవల ప్రత్యేకత. ఇక ఆయన మార్కు ధర్మాధర్మ వ్యాఖ్యానాలు, విశ్లేషణలు... కొంచెం ఓపిగ్గా భరించాలి. తర్వాత చదివింది 'చెలియలికట్ట'. చలం 'మైదానం' నవలకు కౌంటర్‌గా విశ్వనాథ ఈ నవల రాసారట. స్త్రీ పురుషులు స్వేచ్ఛగా ఏ అడ్డూ అదుపూ లేకుండా జీవితాన్ని మైదానంలా అనుభవించాలి అని చలం రాస్తే, ఎగసిపడే సముద్రానికి కూడా చెలియలికట్ట ఉండాలని లేకపోతే ప్రళయం అయి ముంచెత్తుతుందని పెద్దాయన ఉద్దేశమట. ఈ నవల 1935లో రాసారు. 'మైదానం' అంతకుముందే వచ్చి ఉండాలి. చదువుతుంటే, నాకు 'మైదానం' కన్నా ఈ కథనమే (ఖుతీతీఖ్ఱశీఅ) ఎక్కువ నచ్చింది. మధ్య మధ్య ఆయన కొన్ని వాదనలు చదవడానికి బాగున్నాయి. ఉదాహరణకి: "లోకములో జనులెక్కువ మంది మూఢులు. ఆవేశము కొలది పరుల అనుభవము తమదిగా స్వీకరింతురు. ఆవేశము లేకుండ పూర్వుల అనుభవము సంప్రదాయమను పేర స్వీకరించుట తప్పును, తోడి వాని అనుభవము నావేశముతో క్రొత్తయని స్వీకరించుట ఒప్పునుననగునో!" మరొకటి: "జీవితము వర్తకము వంటిది. ప్రతిదినము లాభనష్టములు చూచుకొనినచో తెలియదు. ఒక్కొక్కప్పుడు ఏ సంవత్సరమున కా సంవత్సరము లెక్కచూచినను లుగస్తాను కనిపించవచ్చును. పదియేండ్ల మొత్తముమీద నెంత పెట్టుబడి పెట్టితిమో, యెంత తిరిగి వచ్చినదో, యెంత సరుకు మిగిలినదో చూచుకొని లాభనష్టములు తేల్చుకొన వలయును." ఈ నవల చదువుతున్నంతసేపూ నాకు శరత్, ఠాగూర్ గుర్తొచ్చారు. కొన్ని పంటికిందరాళ్లలా తగిలిన మాటలు కూడా ఉన్నాయి: రంగ-- మనమిరువురము బ్రాహ్మణులము. మన సంతానము బ్రాహ్మణులగుదురు. రత్నా-- బంగినపల్లి చెట్టున కాయ కాచును. ఆ కాయలో పురుగు పడినచో దానిని సేవింపరు. వర్ణము వర్ణత్వమాత్ర విశిష్టమై యేమి శోభించును? దానియందు స్వచ్ఛత్వము కూడ నుండవలయును. ఆడామగా అన్న గీతలే చెరిగిపోతున్న ఈ కాలంలో గురించి రాసిన ఈ నవలని ఎలా చూడాలి?

తన రచనలు భవిష్యత్ తరాల వాళ్ళు చదవకుండా గ్రాంథికంలో రాసి ఆయనే జాగ్రత్తపడ్డాడు. వాటిని సులభ వ్యవహారికంలోకి మార్చే ప్రయత్నం వారి వారసులు చేస్తారనైతే అనుకోవడం లేదు.'



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

భోగాపురం' కాదు..విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్!

21 నుంచి లొకేషన్ కోడ్‌కు సిటీ పేరు మార్పు



భోగాపురం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం కోడ్ విషయమై కొంత గందరగోళం నెలకొన్నందున దాని పేరును మారుస్తున్నట్టు ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ (ఐఏటీఏ) ఓ ప్రకటన జారీచేసింది. ఇప్పటివరకు ఆ విమానాశ్రయ వివరాల్లో వీటీజెడ్ కోడ్‌తో భోగాపురం సిటీ అంటూ అనుబంధంగా వ్యవహరిస్తున్నామని పేర్కొంది. ఈ ఏడాది నవంబరు 21 నుంచి దాని కోడ్ వీటీజెడ్‌గానే ఉంచుతూ సిటీని భోగాపురానికి బదులుగా 'విశాఖపట్నం'గా వ్యవహరిస్తామంది. టికెట్ల వెబ్‌సైట్లలో గందరగోళం లేకుండా ఈ మార్పు చేసినట్టు విమాన ప్రయాణికుల సంఘం తెలిపింది.

అంతర్వేది తీరానికి కొట్టుకొచ్చిన కార్గో షిప్.. సిబ్బందిని రక్షించిన కోస్ట్‌గార్డు



అంతర్వేది , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుపాన్ బీభత్సం కారణంగా అంతర్వేది సముద్ర తీరానికి సింగపూర్‌కు చెందిన సిగ్మా పేరల్ కార్గో షిప్ కొట్టుకొచ్చింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఇండియన్ కోస్ట్ గార్డు సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి.. షిప్‌లో చిక్కుకున్న 20 మందిని సురక్షితంగా రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఈ షిప్‌ను సముద్రంలోకి మళ్లించాలా? లేక ఒడ్డుకు చేర్చాలా? అనే అంశంపై సింగపూర్ అధికారులతో కోస్ట్ గార్డ్ అధికారులు మాట్లాడుతున్నారు. విశాఖపట్నం పోర్టులో సరుకు అన్‌లోడు చేసుకొని తిరిగి సింగపూర్‌కు వెళ్తుండగా.. ఈ షిప్ అంతర్వేదికి కొట్టుకొచ్చిందని వివరించారు. ఇంజన్ ఫెయిల్ కావడంతో ఈ షిప్130 నాటికల్ మైళ్లు కొట్టుకొచ్చిందని తెలిపారు. అంతర్వేది లైట్ హౌస్ సమీపంలో సముద్ర తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ కార్గో షిప్ తేలియాడుతుంది.

కోనసీమలో మళ్లీ గ్యాస్ లీక్..
భయాందోళనలో మాచవరం గ్రామస్తులు



కోనసీమ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): కోనసీమ జిల్లాలో మరోసారి గ్యాస్ లీక్ కలకలం రేపుతోంది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలోని పంట పొలాల్లో పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. గ్యాస్ లీకేజీపై సమాచారం అందిన వెంటనే ఓఎన్జీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీకేజీని అదుపు చేసేందుకు ఓఎన్జీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 26న ఇదే ప్రాంతంలో గ్యాస్ లీకైన విషయం తెలిసిందే. మళ్లీ అక్కడే మరోసారి గ్యాస్ లీక్ అవ్వడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి. త్వరితగతిన ఈ లీకేజీని అదుపు చేయాలని, తరచూ గ్యాస్ లీకేజీలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో స్కూల్ బస్సు
బోల్తా.. డ్రైవర్, ఇద్దరు విద్యార్థులకు గాయాలు



జి.కొండూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జిల్లాలోని జి.కొండూరు మండలం పినపాక రోడ్డులో ఈరోజు(శుక్రవారం) ఉదయం ఓ స్కూల్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, ఇద్దరు విద్యార్థులకు గాయాలవగా.. మిగిలిన విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో మొత్తం 16 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. బస్సు బోల్తా పడిన వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు.. అక్కడకు చేరుకుని బస్సులో నుంచి పిల్లలను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. గాయాలైన డ్రైవర్, విద్యార్థులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులంతా చెవుటూరు, ఆత్కూరు గ్రామాలకు చెందిన వారుగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆకలితో అలమటించొద్దు

- వరద బాధితుల చెంతకు ఎమ్మెల్యే.. మోకాల్లోతు నీటిలో పర్యటన!
- ముంపు గ్రామాల్లో ఆహార పొట్లాల పంపిణీ.. బాధితులకు భరోసా

శ్రీకాకుళం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): వంశధార నది వరదలతో ముంపునకు గురైన గ్రామాల్లో బాధితులకు అండగా నిలిచేందుకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గార మండలంలోని తాంసాహెబ్‌పేట, కండ్రపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మోకాల్లోతు వరద నీటిలో కాలినడకన వెళ్లి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదల కారణంగా ఇళ్లకే పరిమితమైన కుటుంబాలను పరామర్శించి, వారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో బాధితులకు తాగునీరు, భోజనం, చిన్నారులకు పాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముంపు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, క్లోరినేషన్ మాత్రలను అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, పోలీసు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. వరద నీరు పూర్తిగా తగ్గే వరకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నవంబర్ 1న ప్రజాస్వామ్య పండుగ

- నవంబర్ 1 పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు పక్కా ప్రణాళిక
- ఆంధ్రా లయోలా కళాశాలలో కేంద్రాలను పరిశీలించిన విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026 నేపథ్యంలో నవంబర్ 1న జరగనున్న పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆంధ్రా లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ అనంతరం సామగ్రి స్వీకరణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున ఎలాంటి అంతరాయాలు లేకుండా ఎన్నికల సామగ్రిని



నిర్ణీత సమయానికి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం రిసెప్షన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సజావుగా స్వీకరించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు నిర్ణీత గడువులో కౌంటింగ్ పూర్తి చేసి ఫలితాల నివేదికను సమర్పించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే మాక్ డ్రిల్స్ నిర్వహించామని, వాటి ద్వారా గుర్తించిన లోపాలను సరిదిద్దుకుంటూ ప్రతి దశను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కే. షమ్మి, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టు సంక్షేమం కోసం మరో ముందడుగు

- జర్నలిస్ట్ కనకారావుకు గంట్ల శ్రీనుబాబు చేయూత
- 29వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థికి రూ.10 వేల ఆర్థిక ప్రోత్సాహం
- ఎన్నికల్లో పోటీ చేస్తున్న జర్నలిస్టుకు సీనియర్ జర్నలిస్టుల మద్దతు



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 29వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జర్నలిస్ట్ గుర్రం కనకారావుకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. శుక్రవారం తన సొంత నిధుల నుంచి రూ.10 వేల విరాళాన్ని కనకారావుకు అందజేశారు. నిత్యం జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న గంట్ల శ్రీనుబాబు, జర్నలిస్టు వృత్తి నుంచి ప్రజాసేవ దిశగా ఎన్నికల బరిలోకి దిగిన గుర్రం కనకారావుకు తనవంతు సహకారం అందించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా కనకారావుకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన గంట్ల శ్రీనుబాబు, ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన కనకారావు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ప్రోత్సాహం అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొని కనకారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నూజివీడులో కూటమి ఫైత్రయాత్ర

- అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పార్థసారథి
- వైసీపీకి ఓటు అడిగే హక్కు లేదు.. ఓటు వేసే ముందు అభివృద్ధిని గుర్తు చేసుకోండి



నూజివీడు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): నూజివీడు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీలు జోరు పెంచాయి. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి స్వయంగా బైక్ ర్యాలీలో పాల్గొనడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నూజివీడు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని అన్ని వార్డుల మీదుగా సాగింది. కూటమి పార్టీల బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. దారిపొడవునా మూడు పార్టీల జెండాలు చేతబూని కార్యకర్తలు చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. వివిధ వార్డుల్లో మహిళలు మంత్రి కొలుసు పార్థసారథి, ఆయన సతీమణి కొలుసు కమలాలక్ష్మికి మంగళహారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చి ప్రజలపై అప్పుల భారం మోపిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పుడు ప్రజలను ఓట్లు అడగడం ఏమిటని ప్రశ్నించారు. కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేని జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏం న్యాయం చేస్తారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ప్రజల మధ్య ఐక్యతను గుర్తించి అన్ని వర్గాల ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఓటు వేసే ముందు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. నూజివీడు పట్టణంలో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన అనంతరం ఆయా అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. నూజివీడు పట్టణ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే కూటమి పార్టీల బలపరిచిన చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి పార్థసారథి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ భారీ బైక్ ర్యాలీలో ఏపీ అగ్రి మిషన్ వైస్ చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మంత్రి సతీమణి కొలుసు కమలాలక్ష్మి, ఆయన తనయుడు, నితిన్ సాయి కన్నకృష్ణస్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ, కూటమి చైర్మన్ అభ్యర్థి బర్రె ఇళయరాజా, కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, వివిధ వార్డుల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పేదల సొంతింటి కల సాకారం చేస్తాం



- పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమంతో ఉయ్యూరుకు కొత్త రూపు
- మూడు వార్డుల్లో వై.వీ.బీ. రాజేంద్రప్రసాద్, వీరంకి గురుమూర్తి సుడిగాలి ప్రచారం

ఉయ్యూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉయ్యూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వై.వీ.బీ. రాజేంద్రప్రసాద్, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మూడు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ కూటమి అభ్యర్థుల తరఫున సుడిగాలి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఒకటో వార్డు ఎగినపాడు--నాగన్న గూడెం, 13వ వార్డు ఏజీకే నగర్, 22వ వార్డు కాపుల రామాలయం సెంటర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వై.వీ.బీ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదల సంక్షేమంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు. ఉయ్యూరు పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలకు సైతం అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉయ్యూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. అనంతరం వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తికాకుండా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను మరమ్మతులు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉయ్యూరు పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రతి ఓటు కీలకమని పేర్కొంటూ టీడీపీ సైకిల్ గుర్తుపై, జనసేన గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో దుర్గమ్మ తల్లి దేవస్థానం బోర్డు సభ్యుడు వెలగపూడి శంకర్ బాబు, పెనమలూరు మాజీ జెడ్పీటీసీ బొగ్గవరపు వాసు, రామినేని కుటుంబయ్య, మాజీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, రత్నం శివప్రసాద్ బుజ్జి, టీడీపీ చైర్మన్ అభ్యర్థి చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్, ఒకటో వార్డు అభ్యర్థి మోటు నాగేంద్రం, 13వ వార్డు అభ్యర్థి బొర్రా సుబ్బారావు, 22వ వార్డు అభ్యర్థి గంగాభవాని తదితర టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



నాడు చెప్పాం..నేడు చేస్తున్నాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం
- రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడవాలి
- వైసీపీ హయాంలో మత్తు పదార్థాలు.. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం

కొత్తపేట , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందని, స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌కు బాటలు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆలమూరు మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకులు సుంకర శ్రీరాములు తదితరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పెల్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనకు, ప్రస్తుత కూటమి పాలనకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందని, ఆ సమయంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దడానికి రెండున్నరేళ్ల సమయం పట్టిందని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి, మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అమరావతి రాజధాని నిర్మాణాన్ని తిరిగి వేగవంతం చేశామని, పోలవరం ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకువస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. వైసీపీ పాలనలో యువతకు గంజాయి, మత్తు పదార్థాలు అందుబాటులో ఉండేవని ఆరోపించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం వాటి నియంత్రణపై దృష్టి సారించిందన్నారు. యువతకు ఉద్యోగాలు, పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. అర్నబ్ తుపాను సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందస్తు చర్యలు, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులను ఎదుర్కోగలిగామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో ముందస్తు ప్రణాళిక, అనుభవం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేసిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఆస్తుల విక్రయం, అప్పులు తప్ప అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గతంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దుతూనే గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఏర్పడుతుందని వైసీపీ నాయకులు ఆశించారని, అయితే రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించి ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం ఖాయమని బండారు సత్యానందరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ నాయకులు సుంకర శ్రీరాములు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోన్ చార్జింగ్ రూ.10



అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): 'కాదేదీ వ్యాపారానికనర్హం' అంటున్నారు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని వ్యాపారులు. అర్నబ్ ప్రభావంతో కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. దాంతో బంటుమిల్లి మండలం అర్తమూరులో జనరేటర్ ఉన్న ఓ వ్యాపారి మొబైల్ చార్జింగ్‌కు రూ.10 అంటూ వ్యాపారం మొదలు పెట్టేశారు. తుఫాను ప్రభావంతో చాలామంది ఫోన్లు బ్యాటరీ అయిపోయి స్విచాఫ్ అయ్యాయి. వీరంతా ఆ వ్యాపారి వద్దకు క్యూ కడుతున్నారు.

ఆర్నబ్ తుపాను
నష్టం పై ముఖ్యమంత్రి తో మాట్లాడండి

నర్సీపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర లో జరిగిన భారీ పంట నష్టాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి రైతులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు శుక్రవారం నర్సీపట్నం లో స్పీకర్ ని కలిసి ఉత్తరాంధ్ర లోని జిల్లాల వారీగా రైతులకు, ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు అనంతరం భీశెట్టి విలేకరులతో ఉత్తరాంధ్ర లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, చాలా గ్రామాలు నేటికీ నీట మునిగి ఉన్నాయని అన్నదాత ఆవేదన ఊహించని స్థాయిలో ఉందని ముఖ్యం గా కౌలు రైతుల్లో తీవ్రంగా నష్ట పోయామనే ఆవేదన ఉందని,జిల్లాల వారీగా జరిగిన నష్టాల పై అంచనాలకు ప్రత్యేక బృందాలని పంపాలని,మారిన వాతావరణం కారణంగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నను కోరామని ప్రభుత్వం తో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని భీశెట్టి బాబ్జి అన్నారు కార్యక్రమం లో లోక్ సత్తా ప్రతినిధి బోర రమేష్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహాలు వేగవంతం

అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): శుక్రవారం ?రాబోయే స్థానిక ఎన్నికల నిర్వహణ సిద్ధతపై యలమంచిలి మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరియు జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తో కలిసి స్థానిక ఎన్నికలపై అధికారులు, మున్సిపల్ మరియు రెవెన్యూ యంత్రాంగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, షెడ్లు, దివ్యాంగులకు ర్యాంప్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు పక్కాగా ఉన్నదీ లేనిదీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, అక్కడ అదనపు బందోబస్తు మరియు వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గ్రీన్ కోడ్ అఫ్ కండక్ట్ (ప్రవర్తనా నియమావళి) అమల్లోకి వచ్చిన నుండి పారదర్శకంగా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఏ విధమైన అక్రమాలకు తావులేకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, మున్సిపల్ కమిషనర్ డి. జె.ఎస్. పి. రాజు మరియు తహసీల్దార్, డీఎస్పీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి కూటమి పాలన

- 2027 నాటికి పోలవరం పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తాం!
- ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి
- కొత్తూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విస్తృత ఎన్నికల ప్రచారం



దెందులూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): రాష్ట్ర సమగ్రాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు దిశగా కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని దనే విజయలక్ష్మి, జడ్పీటీసీ అభ్యర్థి చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. వృద్ధాప్య పింఛనును రూ.4,000కు పెంచడం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచలేదని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు శాశ్వతంగా సాగునీటి సదుపాయం కలుగుతుందని తెలిపారు. కొత్తూరు గ్రామంలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు సిమెంట్ రోడ్డు కూడా మంజూరు చేశామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పెదపాడు జడ్పీటీసీ అభ్యర్థి చౌటపల్లి విక్రమ్ కిషోర్, కూటమి ఎంపీటీసీ అభ్యర్థిని దనే విజయలక్ష్మి, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదపాడు మండల పార్టీ అధ్యక్షుడు మరడాని రవి, విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ మోరు శ్రావణి, కొత్తూరు రాజు, విశ్వనాథం, మందపాటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విశాఖ ఉత్తరంలో హోరెత్తిన ప్రచారం

- 53వ వార్డులో వైసీపీ ఎన్నికల ప్రచార జోరు
- ప్రచారంలో పాల్గొన్న పేడాడ రమణికుమారి, కె.కె. రాజు
- ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం 53వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్, సాయిబాబా గుడి లైన్, సీతమ్మధార ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు పాల్గొని ఓటర్లను కలిశారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణితో పాటు 53వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సానువల్లి రాజ్‌కుమారిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రాంతాల్లో పర్యటిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో చురుగ్గా పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సతీష్ వర్మ, మాజీ కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు, గుంటూరు నరసింహమూర్తి, గుంటూరు భారతి, వార్డు అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్, మాధవి వర్మ, కోడూరి సుశీల, నవీన్ రాజ్, తులసి, వెంకితో పాటు 53వ వార్డుకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయనగరం మేయర్ పదవికి పోటాపోటీ

విజయనగరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విజయనగరం మున్సిపాలిటీకి 138 సంవత్సరాల చరిత్ర ఉంది.. రాష్ట్రంలో అతి ప్రాచీన మున్సిపల్ నగరానికి రేపు మెయర్ గా కుర్చీలో కూర్చోబోతున్న కొత్త మెయర్ కు... పట్టణ ప్రజలు ఇప్పటినుంచే స్వాగతం పలుకుతూ కొన్ని ముఖ్యమైన సమస్యలను వారి ముందు ఉంచబోతున్నారు.. 1995వ సంవత్సరంలో విజయనగరం వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారికి.. పక్కనే ఉన్న ఆర్థిక మంత్రి అశోక్ గజపతి రాజుకు.. రెవెన్యూ మంత్రి చంద్రబాబు నాయుడుకు.. విజయనగరం పట్టణ ప్రజల తరఫున అతి ముఖ్యమైన సమస్యపై వినతి పత్రం సమర్పించారు.. అప్పట్లో 150 కోట్ల రూపాయలు ఖర్చు కాగల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విజనగరం పట్టణానికి చాలా అవసరమని మున్సిపల్ చైర్మన్గా ప్రసాదుల కనకమలక్ష్మి ఈ ముగ్గురికి ప్రతిపాదనతో కూడిన వినతి పత్రం ఇచ్చారు.. వెంటనే ఎన్టీ రామారావు స్పందించి సంబంధించిన అధికారిక నివేదిక పంపితే వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.... పక్కన సాక్ష్యంగా అశోకగజపతి రాజు ..చంద్రబాబు నాయుడు ఉన్నారు.. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి గారికి పక్కన సాంబశివరాజు శత్రు చర్ల విజయరామరాజు.. బొత్స సత్యనారాయణ ఉంటుండగా విజయనగరం మున్సిపల్ చైర్పర్సన్ గా మీసాల గీత ఇదే సమస్యపై వినత పత్రం ఇచ్చారు.. ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాలా అవసరమని శ్రీమతి మీసాల గీత ప్రకటించడం జరిగింది.. తర్వాత ప్రెస్ మీట్ కూడా ఏర్పాటు చేశారు.. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు.. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి.. ఎవరు ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనకు మోక్షం కల్పించలేకపోతున్నారు.. పలుసార్లు విజయనగరం మున్సిపల్ పాలకవర్గాలు ఈ విషయమై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి కూడా పంపడం జరిగింది.. ఉమ్మడి రాష్ట్రాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేని జిల్లా కేంద్రం విజయనగరం అని చెప్పవచ్చు.. ఏ పాటి



చిన్న వర్షం వచ్చిన విజయనగరం మురికి కాలువలో ఉన్న మురికి నీరు అంతా రోడ్లపై ప్రవహిస్తుంది.. చెత్తాచెదారంతో విజయనగరం ఓ చెత్త నగరంగా మురికి నగరంగా మారుతుంది.. చెప్పాలంటే పేరు గొప్ప ఊరు దిబ్బలా విజయనగరం తయారయింది.. అశోక్ గజపతిరాజు ..కోలగట్ల వీరభద్ర స్వామి వంటి అగ్రకులాలు చెందిన పెద్దలు ఎక్కువసార్లు ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచి ఉన్నత స్థాయి పదవులు చేపట్టినప్పటికీ విజనగరం ప్రజలకు ఈ మురికి నుంచి ఈ చెత్త నుంచి మోక్షం.. విముక్తి .. వంటివి కల్పించలేక పోయారు .. కనీసం ఈ కొత్త మేయర్ అభ్యర్థులు అయినా ఈ సాయంత్రం లోగా ఈ సమస్యపై స్వచ్ఛమైన హామీ ఇవ్వండి... ఎవరో ఒకరు గెలిచాకమీరు కుర్చీలో కూర్చొని ఈ సమస్య పైనే తొలి సంతకం చేయండి.. ముఖ్యంగా నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్న అంటే విధంగా పయనిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడట్లు ప్రతి సంవత్సరం 15% ఇంటి పన్ను ఆస్తి పన్ను ఇక్కడ పెంచేస్తున్నారు.. మరోపక్క సంవత్సరానికి 720 రూపాయలు ఉన్న కొళాయి పన్ను 1200 కి పెంచేశారు... ఇక్కడ విజయనగరం మున్సిపల్ నగర పాలకవర్గం సమావేశం అయ్యాక అంగీకరిస్తేనే ఇంటి పన్నులు కొళాయి పనులు పెంచాలి.. కానీ మొత్తం నిబంధనలు ధిక్కరించే విధంగా విజనగరం పట్టణ పరిధిలో ఇంటి పనులు కొళాయి పనులు పెంచేశారు.. ఎక్కడికక్కడే చెత్తాచెదారాలతో కాలువలు నిండిపోయింది.. మురికి నీటిని తీసే పారిశుధ్య సిబ్బంది కూడా తగినంత సంఖ్యలో లేరు.. విజయనగరం పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బల మొత్తం మురికి దిబ్బలతో నగరం అంతా నిండిపోయింది.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఓ 20 సార్లు విజయనగరం వచ్చారు ..రాజశేఖర్ రెడ్డి కూడా ముఖ్యమంత్రిగా ఓ పదిసార్లు ఇక్కడికి వచ్చారు అలాగే మిగిలిన ముఖ్యమంత్రులు కూడా.. కానీ పలువురు ముఖ్యమంత్రులకు కుడి భుజంగా ఉన్న అశోక్ గజపతిరాజు గాని బొత్స సత్యనారాయణ గాని విజయనగరం అభివృద్ధి కోసం ఏమీ చేయలేక పోయారని ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు.. కోలగట్ల వీరభద్ర స్వామి కూడా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేయలేకపోయారు.. అశోక్ గజపతిరాజు కూడా..మున్సిపల్ నగర పాలనలో ఎప్పుడూ సిండికేట్లరాజకీయ పాలనే నడుస్తుంది.. ఎవరు అధికారంలోకి వచ్చిన వైసీపీ తెలుగుదేశం ఇతర కూటమి నాయకులు కలిసిపోయి సిండికేట్లుగా పనిచేస్తూ కొంతమంది దోచుకుంటారు.. ఇక్కడ సిండికేట్ల మధ్యం కేసు పెండింగ్లో ఉంది.. మునిసిపల్ కాంట్రాక్టులు.. చెరువుల అమ్ము కోవడం.. అనధికార లేఅవుట్లు వేయడం.. వంటి అవినీతి అవకతవకల పనులకు అధికారులు రాజకీయ నాయకులు కలిసి చేయడంతో ఈ అవినీతి సొమ్ముతో ఎందరో ప్యాలస్సులు భవనాలు కట్టుకుంటూ మూడేసి నుమోలుతో తిరుగ ుతున్నారు. ...చెప్పాలంటే విజయనగరంలో ఇలాంటివారు ఇప్పుడు కోట్లకి పడగలెత్తి అవినీతి సొమ్ముతో విజయనగరంలో రాజ్యం వెలుతున్నారు.. చుట్టుపక్కల 200 చెరువుల వరకు ఆక్రమించి అమ్మేసుకున్నారు.. ప్రభుత్వ మాస్సస్ రెవిన్యూ తదితర స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించి అమ్ముకుంటున్నారు దోచుకుంటున్నారు.. ఇక్కడ సిండికేట్ రాజకీయాలకు విసిగి పోయి ఏ ఒక్క కమిషనర్ సంవత్సర కూడా ఉండలేకపోతున్నారు.. దయచేసి రేపు వచ్చే కొత్త పాలకవర్గం అయిన కళ్ళు తెరవండి విజయనగరాన్ని అభివృద్ధి బాటలో నడిపించండి.

టీడీపీలో చేరిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే అప్పల నాయుడు



విజయనగరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విజయనగరం జిల్లా నెల్లిమర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే బడుకొండ అప్పల నాయుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హోంమంత్రి అనిత సమక్షంలో టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సిద్ధాంతాలు, కూటమి పరిపాలన విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు అప్పలనాయుడు ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, కూటమి నాయకుల ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి తన వంతు పాటుపడతానని వివరించారు. కాగా అప్పలనాయుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు బంధువు కావడం విశేషం. ఇటీవల బొత్స ముఖ్య అనుచరుడు, బంధువు మజ్జి శ్రీనివాస్ టీడీపీలో చేరారు. అతడికి సమీప బంధువు అప్పలనాయుడు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఈనెల 2న తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం అప్పలనాయుడు పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటన విడుదల చేసింది.

బిజెపి అభ్యర్థి ఎన్నికల ప్రచారం



అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): నగర పాలక సంస్థ 111 వార్డు కార్పొరేటర్ గా పలక రవి యశోద గెలిపించాలని ప్రచారం జరిగింది ఈ సందర్భంగా యశోద మాట్లాడుతూ కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు కోటినీ వీధి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అందరూ సహకరించాలని కరపత్రాలు అందజేశారు కూటమి నాయకులు పెద్ద ఎత్తున ఆమె వెంట నడిచారు ప్రజలనుండి మంచి స్పందన లభించింది వారికి సంఘీభావంగా రావికమతం మండల బిజెపి అధ్యక్షులు గూటాల చిన్న ప్రధాన కార్యదర్శి దాంట్ల సత్యనారాయణ మజ్జి గోవింద నాగేశ్వరరావు వెంకట్రావు అనకావల్లిలో బంధువులు స్నేహితులు అమూల్యమైన ఓటును కమలం గుర్తుపై వేయాలని చెప్పడం జరిగింది

గ్యాస్ పంపిణీకి ఓటీపీ నుంచి తాత్కాలిక మినహాయింపు

అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాను కారణంగా ఏర్పడిన అంతరాయాలు, విద్యుత్ సరఫరాలో నిలిచిపోయిన పరిస్థితులు, మొబైల్ నెట్‌వర్క్‌లు మరియు ఇంటర్నెట్ కనెక్టివిటీలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఆంధ్రప్రదేశ్‌లోని తుఫాను ప్రభావిత 13 జిల్లాల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఓటీపీ (ఓ్యా) ఆధారిత ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వడంతో పాటు, నగదు చెల్లింపు ద్వారా నేరుగా సిలిండర్లను పొందే (ఝుంష్ట్ర ఖఅఽ ఝుతీతీఎ) విధానాన్ని అమలు చేసేందుకు భారత ప్రభుత్వ పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది.అనకాపల్లి జిల్లాలోని తుఫాను ప్రభావిత గ్రామాల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఓటీపీ (ఓ్యా) ఆధారిత ధృవీకరణ నుంచి తాత్కాలిక మినహాయింపు కల్పిస్తూ, నగదు చెల్లింపు .

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

విశాఖ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విశాఖ పోర్టు ట్రస్ట్ పరిధిలో ఈ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలో ఉన్న జేఎం భక్షి కంపెనీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకు న్నాయి. ఈ ఘటనతో పోర్టు సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్‌పై ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున



అగ్నికీలలు ఎగసిపడటంతో పాటు, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ పోర్టు ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కన్వేయర్ బెల్ట్ వద్ద జరుగుతున్న వెల్డింగ్ పనుల కారణంగా చెలరేగిన నిప్పురవ్వలే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పోర్టు అధికారులు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలి



అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ 110వ వార్డులో విస్తృత ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. .ఈ సందర్భంగా వేల్పుల వీధి వీధులు, పరిసర ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి తాడి శాంతి కుమారి గారితో కలిసి ఇంటింటి ప్రచా రం నిర్వహించి ప్రజలను కలుసుకొని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరఫున ఎన్నికల ప్రచారాన్ని విన్నతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 110వ వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి జడ్పిటిసి ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలి

అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): మండల జడ్పిటిసి ఎంపీటీసీల ప్రసారం కార్యక్రమం శుక్రవారం జోరుగా సాగింది అందులో భాగంగా తేగడా కొత్తపల్లి జమాదులపాలెం విస్సన్నపేట రామన్నపాలెం గ్రామంలో జడ్పిటిసి. ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున పొన్నగంటి అప్పారావు ప్రచారం నిర్వహించారు . అప్పారావు మాట్లాడుతూ రెండున్నర ఏళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కళ్ళు ముందు కనిపిస్తున్నాయని తెలియజేశారు . . కూటమిపాలన అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా సాగుతుందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోని లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నామని . గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి పాలనలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ . మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సహకారంతో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు.

నవంబర్ 1న పోలింగ్ నేపథ్యంలో స్థానిక సెలవు

విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా నవంబర్ 1న జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్తి కిశోర్ తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజున అనగా అక్టోబర్ 31న, నవంబర్ 1న సెలవు ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాలుగా గుర్తించిన సంస్థల్లో ఓట్ల లెక్కింపు రోజున అనగా నవంబర్ 3న కూడా సెలవు ఉంటుందని స్పష్టం చేశారు.ప్రైవేటు సంస్థలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నవంబర్ 1న వేతనంతో కూడిన సెలవు ప్రకటించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్ సూచించారు. పూర్తి రోజు సెలవు ఇవ్వడం సాధ్యం కాని పక్షంలో ఓటు వేసేందుకు కనీసం మూడు గంటల పాటు విధుల నుంచి వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను, ఎంసీసీ నిబంధనలు అందరూ పాటించాలని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచిన కవిటి తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి

కవిటి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో కవిటి మండల తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ప్రజలకు అందించిన సేవలు అభినంద నీయం. తుఫాన్ సమయంలో రెండు రోజుల పాటు మండల తహసీల్దార్ కార్యాలయంలోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితు ల్లోనూ విధుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యల సమన్వయానికి కృషి



చేశారు. విపత్తుల సమయంలో ప్రభుత్వ అధికారులు ప్రజ లకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలపై తక్షణమే స్పందించడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన సేవలు తెలియజేస్తున్నాయి. ప్రజల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ తుఫాన్ సమయంలో కార్యాలయంలోనే ఉండి సేవలందించిన తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తిని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అండగా నిలిచినప్పుడే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. విపత్తు సమయంలో విధి నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు అందించిన తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి సేవలు ప్రశంసనీయం.

ఆర్నాబ్ తుఫాన్‌తో కోటనందూరులో జనజీవనం స్తంభనం

కోటనందూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కోటనందూరు మండలంలో జనజీవనం స్తంభించింది. తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు, వరద ప్రవాహాలతో చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య ఎదురవుతుండగా, రహదారులపై వరద ప్రవాహాలు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఉప్పరగూడెం వద్ద నిలిచిపోయిన రాకపోకలు. ...తుఫాన్ ప్రభావంతో తుని– నర్సీపట్నం ప్రధాన రహదారిలో ఉప్పరగూడెం శివారులోని వెదురు గడ్డ వాగు పొంగిపొర్లడంతో రహదారిపై వరద నీరు ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయా యి. రహదారిపై నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు .సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ, రహదారులు--భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వరద ప్రవాహం దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వాహనాల



రాకపోకలను నిలిపివేశారు. వరద నీటి ఉధృతి తగ్గేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితుల్లో రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచిస్తున్నారు. విద్యుత్ కోతలతో తాగునీటి కష్టాలు...తుఫాన్ ప్రభావంతో మంగళవారం నుంచి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, ఇతర ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు.తుఫాన్ ప్రభావం కారణంగా సాధారణ కార్యకలాపాలు దెబ్బతినడంతో పాటు ప్రజల రోజువారీ జీవనం అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉద్యాన పంటలకు నష్టం.. రైతుల్లో ఆందోళన...తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలుచోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, భారీ వర్షాల ప్రభావంతో పంట నష్టంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు తుఫాన్ రూపంలో ఎదురైన విపత్తు ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పొంగిపొర్లుతున్న వాగులు.. ప్రజల్లో ఆందోళన....మండలంలోని పలు ప్రాంతాల్లో చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహాలు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చోట ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కంట్రోల్ రూమ్‌పై ప్రజల అసంతృప్తి ....తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు మండలంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసినప్పటికీ సరైన స్పందన లభించడం లేదని పలువురు ప్రజలు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించేందుకు, సహాయం కోరేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్లకు స్పందన లేకపోతే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై అధికారులు వెంటనే స్పందించాలని, కంట్రోల్ రూమ్ నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలి...తుఫాన్ ప్రభావంతో మండలంలో విద్యుత్, తాగునీరు, రవాణా, వ్యవసాయ రంగాలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. నేలకొరిగిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, వరద ప్రభావిత రహదారుల పర్యవేక్షణ, పంట నష్టాల అంచనా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, బాధితులకు సకాలంలో సహాయం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అర్నాబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు విస్తృత పర్యటన

అమలాపురం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): రాజ్యసభ ఎంపీ శ్రీ సానా సతీష్ బాబు బుధవారం ఉదయం 6 గంటల నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అర్నాబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. నష్టాన్ని స్వయంగా అంచనా వేయడానికి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించడానికి ఆయన అల్లవరం, గోపాయిలంక, గోడి, బెండెమూర్లంక, ఓడలారేవు, కొమరగిరి పట్నం మరియు నక్క రామేశ్వరం ప్రాంతాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా, ఎంపీ బాధితులతో మాట్లాడి, వారికి భరోసా ఇచ్చారు. అలాగే, నిరాశ్రయులైన కుటుంబాలకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించడానికి పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఓడలరేవులో, శ్రీ సానా సతీష్ బాబు తుఫాను వల్ల దెబ్బతిన్న 200 మత్స్య పడవలను పరిశీలించి, నష్టపోయిన మత్స్యకారులను కలిశారు. ప్రభావిత మత్స్యకారులకు ప్రభుత్వం నుండి అవసరమైన సహాయం అందేలా చూస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, తగిన సహాయక చర్యలు చేపడతానని కూడా ఆయన వాగ్దానం చేశారు. ప్రజలు మరింత ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సహాయక, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ప్రభావిత వర్గాలకు అవసరమైన సహాయాన్ని వెంటనే అందించడంతో పాటు, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారి అనుసంధానాన్ని వేగంగా పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సహాయక చర్యల పట్ల తన నిబద్ధతను ప్రదర్శిస్తూ, తుఫాను కారణంగా అడ్డుపడిన రహదారులపై పడిపోయిన చెట్లను తొలగించడంలో శ్రీ సానా సతీష్ బాబు స్వయంగా పాల్గొన్నారు. అధికారులు ఒకరితో ఒకరు సన్నిహితంగా సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన వారికి ఆలస్యం లేకుండా సహాయం అందేలా చూడాలని ఆయన ఆదేశించారు.

ఆర్నాబ్ తుపాను సహాయక చర్యలు ముమ్మరం

- శుక్రవారం నాటికి రహదారులపై కూలిన చెట్ల తొలగింపు పూర్తి చేయాలి
- 45 జేసీబీలతో రాత్రింబవళ్లు సహాయక చర్యలు
- నార్త్, వెస్ట్ జోన్లలోని నాలుగు పునరావాస కేంద్రాల్లో 94 మందికి ఆశ్రయం
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఆర్నాబ్ తుపాను ప్రభావంతో నగరంలో నేలకొరిగిన చెట్ల తొలగింపు, రహదారులపై పేరుకుపోయిన వ్యర్థాల శుభ్రత, దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులను జీవీఎంసీ ముమ్మరంగా చేపడుతోందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, తుపాను కారణంగా నేలకొరిగిన చెట్ల తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈస్ట్ జోన్ లో దత్ ఐలాండ్ నుంచి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారితో పాటు బీచ్ రోడ్డులో పర్యటించి, చెట్ల తొలగింపు అనంతరం రహదారులపై మిగిలిన కొమ్మలు, ఆకులు, ఇతర వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల్లో గుంతలను గుర్తించి తక్షణమే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి, రహదారులను త్వరితగతిన పునరుద్ధరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

"1,192 చెట్లు
నేలకొరగ్గా.. 1,057 చెట్ల తొలగింపు పూర్తి"

గురువారం 6 గంటల వరకు అందిన సమాచారంతో తుపాను ప్రభావంతో జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో మొత్తం 1,192 చెట్లు నేలకొరిగాయి. వీటిలో 1,057 చెట్లను కట్ చేసి కొమ్మలను తొలగించగా, మిగిలిన 135 చెట్లకు సంబంధించి కటింగ్, కొమ్మల తొలగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 902 చెట్లను పూర్తిగా తరలించి, వాటి కారణంగా ఏర్పడిన అడ్డంకులను తొలగించారు. మరో 290 చెట్లను తరలించాల్సి ఉంది. చెట్లను కట్ చేయడం, కొమ్మలను తొలగించడం, వాటిని పూర్తిగా తరలించడం వంటి పనులను వేగవంతం చేసి, శుక్రవారం నాటికి రహదారులపై కూలిన చెట్ల తొలగింపు పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు. చెట్ల తొలగింపు పనుల కోసం 45 జేసీబీలతో పాటు టిప్పర్లు, అదనపు పారిశుద్ధ్య కార్మికు లను వినియోగిస్తూ రాత్రింబవళ్లు సహాయక



చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. చెట్ల తొలగింపు అనంతరం రహదారులపై మిగిలిన కొమ్మలు, ఆకులు, ఇతర వ్యర్థాలను కూడా తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

"313 రహదారులపై అడ్డంకుల తొలగింపు"

తాజా నివేదిక ప్రకారం, నేలకొరిగిన చెట్ల కారణంగా నగరంలో 313 రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నివేదిక సమయానికి ఈ 313 రహదారులపైనా అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన చెట్లను తరలించే సమయంలోనూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

"శుక్రవారం నాటికి శతశాతం తాగునీటి సరఫరాకు చర్యలు"

తుపాను ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. గురువారం నాటికి నగరంలో సుమారు 70 శాతం తాగునీటి సరఫరాను పునరుద్ధరిం చామని, మిగిలిన ప్రాంతాలకు కూడా శుక్రవారం నాటికి శతశాతం నీటి సరఫరా అందిం చేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితిలో తాగునీటి సేవ లు అందించాలని సంబంధిత అధికారు లకు సూచించారు.

" నేటికీ పునరావాస కేంద్రాల్లో 94 మందికి ఆశ్రయం"

తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో అవసరమైన ప్రాంతాల ప్రజలను పలు పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి ఆహారం, వసతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. పరిస్థితులు అనుకూలించిన అనంతరం పలువురిని సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చినట్లు పేర్కొన్నారు. అయితే, గురువారం నాటికి నార్త్, వెస్ట్ జోన్ల పరిధిలోని నాలుగు పునరావాస కేంద్రాల్లో మొత్తం 94 మంది ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. వారికి ఆహారం, వసతి, ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజల భద్రత, సౌకర్యాలపై సంబంధిత అధికా రులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

"సహాయక చర్యలపై
నిరంతర పర్యవేక్షణ"

నగరంలో తుపాను సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాల యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై కూలిన చెట్ల తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, పర్య వేక్షక ఇంజనీర్ ఏ. శ్రీనివా సరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో విస్తృతంగా పర్యటించిన వరుదు కళ్యాణి



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 46వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి నూనెల లావణ్య, 47వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మల్లా దేవి విశాలాక్షి, 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి కర్రి రమణ రెడ్డి, 49వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి మాధవి బొడ్డేటి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల పరిధిలోని రైల్వే న్యూ కాలనీ, తాటి చెట్ల పాలెం, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మేయర్ అభ్యర్థి శ్రీమతి వరుదు కళ్యాణి గారికి ఘనస్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి గారికి, స్థానిక కార్పొరేటర్ అభ్యర్థులకు తమ మద్దతును ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు. విశాఖపట్నంలోని మాధవధారలో ఉన్న గ్రాండ్ విలన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన క్రైస్తవ ఆత్మీయ సమావేశానికి వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వ యకర్త కె.కె. రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తనకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని సమావేశానికి హాజరైన క్రైస్తవ సోదరులు, పాస్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కీలక నాయకులతో పాటు జాన్ వెస్లీ, పాల విక్టర , జోహన్ వెసలే, రాజశేఖర్, డేవిడ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక పాస్టర్లు, వివిధ క్రైస్తవ సంఘాల సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీ సింహాద్రినాథ శాశ్వత అన్నప్రసాద పథకానికి రూ.1,10,011 విరాళం

సింహాచలం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సింహాద్రినాథ శాశ్వత అన్నప్రసాద పథకానికి విశాఖపట్నానికి చెందిన కొండపు పరిణిత రెడ్డి రూ.1,10,011 (ఒక లక్ష పది వేల పదకొండు రూపాయలు) విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దాత ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించి, శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు .

జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం 10 జోన్లలో వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారులను, నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు

విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం 10 జోన్లలో వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారులను, నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు..జోన్‌లు, వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఇవే.. భీమిలి జోన్: 1 నుంచి 5 వార్డులకు భీమిలి జోనల్ కార్యాలయం, మధురవాడ జోన్: 6 నుంచి 12 వార్డులకు మధురవాడ జోనల్ కార్యాలయం . ఈస్ట్ జోన్: 12 నుంచి 29 వార్డులకు అసిల్మెట్టలోని ఈస్ట్ జోన్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరిస్తారణ. సౌత్ జోన్: 30 నుంచి 45 వార్డులకు సూర్యాబాగ్‌లో వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని జోనల్ కార్యాలయం, నార్త్ జోన్: 46 నుంచి 65 వార్డులకు మాధవధార వుడా లేఅవుట్‌లోని ఆర్‌టీఏ కార్యాలయం రోడ్డులో ఉన్న నార్త్ జోన్ కార్యాలయం. వెస్ట్ జోన్: 66 నుంచి 82 వార్డులకు ఎన్.ఏ.డి. కొత్త రోడ్డు జంక్షన్‌లోని గౌరీ నగర్‌లో ఉన్న వెస్ట్ జోన్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ. గాజువాక జోన్: 83 నుంచి 101 వార్డులకు శ్రీనగర్‌లోని 100 ఫీట్ రోడ్డులో ఉన్న గాజువాక జోనల్ కార్యాలయం. అగనంపూడి జోన్: 102 నుంచి 106 వార్డులకు పెద్దమడకలోని రాజీవ్ గాంధీ కల్యాణ మండపం, శివాలయం రోడ్డులో ఉన్న అగనంపూడి జోనల్ కార్యాలయం. అనకాపల్లి జోన్: 107 నుంచి 112 వార్డులకు నాలుగు రోడ్ల కూడలిలోని అనకాపల్లి జోనల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ . పెందుర్తి జోన్: 113 నుంచి 120 వార్డులకు నాయుడుతోట జంక్షన్ సమీపంలోని వేపగుంట మెయిన్ రోడ్డులో ఉన్న పెందుర్తి జోనల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ. అభ్యర్థులు తమకు కేటాయించిన వార్డుకు సంబంధించిన నామినేషన్ కేంద్రాన్ని గుర్తించి, నిర్దేశిత ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయాలి

కూటమికి అఖండ విజయాన్ని చేకూర్చండి

బ్రాహ్మణ సమాజానికి దినేష్ రాజ్ పిలుపు

గాజువాక , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో జివిఎంసీ ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థులు అందరూ ఘన విజయం సాధించాలని, అందుకు బ్రాహ్మణ సమాజం తమ వంతు కృషి చేయాలని టీడీపీ నాయకుడు వారణాశి దినేష్ రాజ్ పిలుపు ఇచ్చారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విశాఖ నగరంలో పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయని ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్న ఈ సమయంలో ప్రభుత్వానికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బ్రాహ్మణ కుటుంబ సభ్యులు అందరకూ వుందని తెలియ చేశారు. కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని వారికి ఎటువంటి బ్రాహ్మణ సమాజం నుండి మద్దతు లేదని తెలియ చేశారు. మేయర్ అభర్థిని ముక్కా శ్రావణి, మరియు తెలుగుదేశం జనసేన బిజేపి నుండి పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులందరినీఅఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు . బ్రాహ్మణులు ప్రగతి కారకులని నగరాభివృద్ధికి శ్రీ భరత్, పల్లా సారధ్యంలో అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములు కావాలని కోరారు. మీడియాతో మాట్లాడుతూ . ఈ సందర్భంగా దినేష్ రాజ్ మీడియాతో మాట్లాడారు. బ్రాహ్మణులకు విశాఖ పశ్చిమ నియోజక వర్గం నుండి కార్పొరేటర్ గా పోటీకి అవకాశం కల్పించడం పట్ల దినేష్ హర్షం వ్యక్తం చేశారు. గ్రేటర్



విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా నవంబర్ 1 జరుగు పోలింగ్ నేపథ్యంలో ఓటర్లుగా నమోదు చేసుకున్న ప్రతీ ఒక్కరూ తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిరం తరం అభివృద్ధి చెందుతున్న విశాఖనగరం శాంతి భద్రతలతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలుగుదేశం జనసేన బిజేపి మేయర్ ఉమ్మడి అభ్యర్థిని ముక్కా శ్రావణి కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ ఇచ్చి ప్రజలు అభివృద్ధి వైపే ఉన్నారని నిరూపించా లని ఆయన విజ్ఞప్తి చేశారు. కూటమి కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేయుచున్న వారందరికీ అత్యధిక మెజారిటీ ఇవ్వవలసిందిగా కోరారు. విశాఖ నగరం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల న్నా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచి ఘన విజయాన్ని చేకూర్చాలని దినేష్ కోరారు.

తుఫాను బాధిత ప్రాంతాలను సందర్శించిన సిపిఎం బృందం



కాకినాడ , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అర్నబ్ తుఫాను తాకడికి గురైన కాకినాడ మహాలక్ష్మి నగర్, ముత్తానగర్, తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ, పగడాలపేట ప్రాంతాలను సిపిఎం కార్యదర్శి కరణం ప్రసాద్, చింతపల్లి అజయ్ కుమార్లు పర్యటించారు. తుఫాను తాకిడికి తోడు రూరల్ గుండా కాకినాడ కార్పొరేషన్ నిర్మించిన భారీ డ్రైన్ కు చివరిలో నీరు బయటకు పోయే మార్గం లేకపోవడం వలన అల్లూరి సీతారామరాజు కాలనీ, డ్రైవర్స్ కాలనీ, మహాలక్ష్మి నగర్ ప్రాంతాలు తీవ్ర ముంపుకు గురయ్యాయన్నారు. ఈ డ్రైన్ కు చివరి ప్రాంతంలో " లిఫ్ట్ ద్వారా " కాలువ నీటిని సముద్రానికి పంపే శాశ్వత ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పగడాల పేటలో నిర్మించిన బహుళ సామాజిక పునరావాస కేంద్రం గాని, అల్లూరి సీతారామరాజు కాలనీలో ఉన్న తుఫాను షెల్టర్లు గాని బాధితులకు పునరావాసానికి ఉపయోగించడం లేదని, 4,5 సచివాలయాలకు ఈ తుఫాను షెల్టర్ నే ఉపయోగించడం సరైంది కాదని కలెక్టర్ వీటిని సరిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అల్లూరి సీతారామ రాజు కాలనీ తదితర ప్రాంతాల్లో విరిగిపోయిన కరెంటు స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన పునర్మించాలని, అల్లూరి సీతారామరాజు కాలనీ డోర్ నెంబర్ 12 - 457, 12-550 లవద్ద ఉన్న కరెంటు స్తంభాలు పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త స్థంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని చింతపల్లి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో బాధితులతో మాట్లాడి పునరావాస కేం ద్రాలను కూడా వారు సందర్శించారు.

జడ్పీ నిధులతో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా : జెడ్పీటీసీ అభ్యర్థి జీను మణిబాబు



జగ్గంపేట , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జగ్గంపేట జెడ్పీటీసీ అభ్యర్థి జీను మణిబాబు ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. గ్రామాల్లో ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన అభ్యర్థిగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా జీను మణిబాబు మాట్లాడుతూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ లు తనను బలపరిచి జగ్గంపేట మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా నిలబెట్టారని తెలిపారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే జిల్లా పరిషత్ నిధులతో జగ్గంపేట మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ప్రతి గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో మండలాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, అందుకే సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలి : ఎమ్మెల్యే బత్తుల



రాజానగరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నియోజక వర్గం పరిధిలోని దివాన్ చెరువు, రఘునాధపురం,సంపత్ నగర్,నామవారం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు, యువత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని,. ప్రతీ గ్రామానికి తాగునీరు, రోడ్ల సౌకర్యం, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థులను ఆశీర్వ దించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల శ్రేణులు కలిసి కట్టుగా పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్ర మంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

ఫోక్సో కేసు నమోదు నిందితుడు అరెస్ట్



అడ్డతీగల , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అడ్డతీగల మండలంల వీరభద్రపురం గ్రామంలో ఈ నెల 19వ తేదీన 17 ఏళ్ల మైనర్ బాలిక అదృశ్యమైనట్లు, స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాగా, దానిని విచారణ అనంతరం ఫోక్సో కేసుగా మార్పు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి వీరభద్రపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలిక ఇంటి నుంచి అదృశ్యం కాగా ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, స్థానిక ఎస్సై బి. వినోద్ అదృశ్యం కేసుగా నమోదు చేశారు. వెంటనే రంగ ప్రవేశం చేసిన పోలీసులు లోతుగా విచారణ చేయడంతో అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలిసి వివరాలు సేకరించగా ,వీరభద్రపురం గ్రామానికి చెందిన పలివెల. వినయ్ బాలికకు మాయ మాటలు చెప్పి వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి, ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించినట్లు బాధిత బాలిక పోలీసులకు వెల్లడించింది. అనంతరం బాలికను సురక్షితంగా తీసుకువచ్చి ఈనెల 25వ తేదీ అదృశ్యం కేసును ఫోక్సో కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేసినట్లు సిఐ ఎం గజేంద్ర కుమార్ తెలిపారు. నిందితుడు పలివెల. వినయ్ 29వ తేదీ పాపంపేట గ్రామం వద్ద సంచరిస్తుండగా, ఎస్సై వినోద్ ఆధ్వర్యంలోని సిబ్బంది పట్టుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు అనంతరం నిందితుడిని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరచగా న్యాయ మూర్తి రిమాండ్ విధించగా ,రాజమండ్రి సెంటర్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారం రోజుల్లోనే కేసును చేదించి నిందితుడ్ని అరెస్టు చేసిన సిబ్బందిని అధికారులు అభినందించారు.

గన్నవరం మెట్ట వద్ద వేదుల్ల గెడ్డ పూడికతీత పనులు పరిశీలన

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): నాతవరం మండలం గన్నవరం మెట్ట వద్ద ఉన్న వేదుల్ల గెడ్డలో ఉన్న పూడికతీత పనులను గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరియు జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ పరిశీలించి ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా గెడ్డను పునరుద్ధ రించామని, దీనివల్ల రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోవడమే కాకుండా వరద ముప్పు తప్పుతుందని పేర్కొన్నారు. నీటి పారుదల సజావుగా సాగే లా వేదుల్ల గెడ్డలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించామని చెప్పారు. ఇక నుండి వర్షాకాలంలో గెడ్డల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, సమీప పొలాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ తో పాటు జిల్లా అధికారులు పోలీస్ శాఖ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనడం అయినది.

గోడ కూలి నిరుపేద కుటుంబం ఇల్లు నేలమట్టం

కవిటి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): కవిటి మండలం కపాసుకుద్ది గ్రామం లో వంక రుక్మిణమ్మకు చెందిన గోడ కూలి గోడ కూలి పక్కనే ఉన్న బడే బాలమ్మ ఇంటిపై పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రెండు కుటుంబాలు నిరుపేద కుటుంబాలే కావడంతో ఈ ఘటనతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అయితే, బాలమ్మకు పూర్తిస్థాయిలో కంటి చూపు లేకపోవడంతో ఆమె పరిస్థితి మరింత దయనీయం గా మారింది. నివసించేందుకు ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఆమెకు ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి ఇలాంటి విపత్తు ఎదురవడంతో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో నతమతమవుతున్న కుటుంబానికి ఇల్లు కూలిపోవడం పెద్ద దెబ్బగా మారింది. సంబంధిత అధికారులు ఘటనపై పరిశీలన జరిపి, నష్టాన్ని అంచనా వేసి, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా చూపులేని బాలమ్మకు ప్రభుత్వం, దాతలు అండగా నిలిచి, నివాస సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖను కాపాడేందుకు వైసిపిని గెలిపించుకోవాలి

భీమిలి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): దళపతి తగరపువలస, భీమిలిలో వైఎస్సార్సీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి గెలుపు కోసం అలాగే కార్పొరేటర్లు గెలుపు కోసం తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ మధ్యాహ్నం తగరపువలస ప్రచారం నిర్వహిం చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖపట్నం నగరంలోని ప్రజా ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ పేర్కొన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పే పాలకులు, ముందుగా నగర ప్రజల ఆస్తులు, హక్కులు, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా విశాఖ అభివృద్ధికి ఎంతోమంది నాయకులు, కార్మికులు, సామాన్య ప్రజలు కృషి చేశారని, వారి శ్రమతో రూపుదిద్దుకున్న నగర సంపదను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజలకు చెందాల్సిన భూములు, ప్రభుత్వ ఆస్తులు, అభివృద్ధి నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా ఆస్తులకు సంబంధించి ఎలాంటి అక్రమాలు జరిగినా వాటిపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. విశాఖ అభివృద్ధి అంటే భవనాలు, రహదారులు మాత్రమే కాదు.. ప్రజల ఆస్తులకు రక్షణ, పేదలకు న్యాయం, యువతకు ఉపాధి, ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడం కూడా అభివృద్ధిలో భాగమేనని బి.వి.రామ్ అన్నారు. నగరాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలంటే ప్రజల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సహాయం, న్యాయమైన నష్టపరిహారం అందించాలని, బాధితులను రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



విశాఖ ప్రగతిని నిర్దేశించే ఎన్నికలు : గంటా

భీమునిపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విశాఖ ప్రగతిని నిర్దేశించే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరిని అధిక మెజారిటీతో గెలిపించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి చేసినట్టే జీవీఎంసీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో విశాఖ అభివృద్ధిని పరుగులు తీయిస్తామన్నారు. సీఎం చంద్రబాబు మానస పుత్రిక విశాఖ నుంచే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని, ప్రపంచ పటంలో తిరుగులేని స్థానం పదిలపరిచారని చెప్పారు. హుద్ హుద్ తుపాను సమయంలో 15 రోజుల పాటు బస్సు నుంచే పాలన సాగించి పరిస్థితున్నీ చక్కబడిన తర్వాతే విశాఖ నుంచి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ ప్రజలు కూడా ఎప్పుడూ చంద్రబాబు వెన్నంటే ఉన్నారని, 2019 లో వైసీపీ గాలిలోనూ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ స్థానాల్లో టీడీపీ విజయం సాధించిందన్నారు. 2019 లో భీమిలి నుంచి పోటీ చేసిన స్వర్గీయ సబ్బం హరి ఓడిపోయినప్పటికీ అర్బన్ లో వైసీపీ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని చెబుతూ జీవీఎంసీ టీడీపీకి కంచుకోటగా అభివర్ణిం చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీలు సాధించిన మొదటి నాలుగు స్థానాల్లో మూడు విశాఖ నుంచే వచ్చాయన్నారు. ఆంధ్రలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు జీవీఎంసీ లో కూడా కూటమి అధికారంలో ఉంటే విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ బెదిరింపులకు వెరవక 2021 లో ఉత్తర అసెంబ్లీ నియోజ కవర్గంలోని 17 స్థానాల్లో ఒక్క ముక్కా శ్రావణి మాత్రమే కార్పొరేటర్ గా గెలిచిందని చెప్పారు. 2000 తాను అనకాపల్లి ఎంపీగా ఉన్నప్పుడు జీవీఎంసీ ఎన్నికల పొత్తులో బీజేపీకి కేటాయించిన వార్డును ఆఖరి నిమిషంలో మార్చి శ్రావణి తండ్రి ముక్కా ముత్యాల నాయుడికి ఇచ్చా మన్నారు. టీడీపీకి వీర విధేయురాలైన శ్రావణి సహా కార్పొరేట్ అభ్యర్థుల్ని గెలిపించి ఆశీర్వదించాలని పేర్కొన్నారు. ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి, భీమిలి టీడీపీ ఇంచార్జి చిక్కాల విజయ్ బాబు, జనసేన ఇంచార్జి పంచకర్ల సందీప్, బీజేపీ ఇంచార్జి జీరు కైలాష్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులు ఇప్పాక వరలక్ష్మి, గరే సదానంద, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పాసి సుస్మిత, చోడిపిల్లి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో జోరుగా వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారం



దేవరాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): దేవరాపల్లి మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వేడి రాజుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం పోలింగ్ తేదీని నవం బర్ 5 కి వాయిదా వేయ డంతో అభ్యర్థులు ప్రచారంలో మరింత దూసుకుపో తున్నా రు.ఇందులో భాగంగా చింతల పూడి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని చింతలపూడి, తామరబ్బ గ్రామాల్లో వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఇంటింటి ప్రచారం నిర్వ హించారు.దేవరాపల్లి మండల వైఎస్సార్సీపీ ఎంపీపీ అభ్యర్థి బూరె బాబురావు,చింతలపూడి ఎంపీటీసీ అభ్యర్థి గుమడాపు మహేశ్వరరావు కార్యకర్తలను వెంటబెట్టు కుని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు.ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జడ్పీటీసీ అభ్యర్థి వేచలపు డిండిమ వెంకట వాణి ని, ఎంపీటీసీ అభ్యర్థి గుమడాపు మహేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.గత వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తమకే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశా రు.ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్య క్రమంలో చింతలపూడి మాజీ ఎం పీటీ సీ బండి గౌరమ్మ, మాజీ సర్పంచ్ దొమ్మ ంగి బోడెమ్మ, తామరబ్బ మాజీ సర్పం చులు టోకూరు రామకృష్ణ, మూలగుమ్మి అప్పన్న దొర, సీనియర్ నాయకులు గుమడాపు దేముడు బాబు, దొమ్మంగి సన్యాసమ్మ, మాజీ ఉప సర్ప ంచ్ గంగ రాజు, రాజు,శివాజీ, సింహా చలం, చంద్రరావు, రవి, చంటి, మల్లేష్, నారా యణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉండాలి

అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని జలాశయాలు, సాగునీటి చెరువుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దేరు, కోణం జలాశయాలతో పాటు జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు పూర్తి సామర్థ్యానికి చేరుకుంటున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు పెద్దేరు జలాశయం నుంచి విడుదల చేసిన 3,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం తగ్గిందని, కోణం జలాశయం నుంచి 1,000 నుంచి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు ఆర్డీవోలు, తహశీల్దార్లు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని ప్రతి సాగునీటి చెరువును స్వయంగా పరిశీలించాలని, చెరువుల గేట్లు, లీకేజీలు, సర్ప్లస్ వీర్ల పరిస్థితిని తనిఖీ చేయాలని సూచించారు జలాశయాల వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలను పర్యవేక్షించేందుకు వచ్చే నెల రోజుల పాటు ఇద్దరు దినసరి కూలీలను నియమించాలని ఆదేశించారు పంట నష్టం నివారణకు ప్రత్యేక చర్యలు, వర్షపు నీరు వ్యవసాయ పొలాల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు మోటార్లు, పంపులు, జేసీబీల సహాయంతో పొలాల్లో నిలిచిన నీటిని తక్షణమే బయటకు పంపించాలని, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పంట నష్టాన్ని కనిష్ట స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు ఈదురుగాలుల కారణంగా దెబ్బతిన్న సుమారు 200 హెక్టార్ల ఉద్యానవన పంటలకు సంబంధించిన వివరాలను సచివాలయాల వారీగా సేకరించాలని, ఆర్ఎస్‌కే సిబ్బంది, వీఆర్వోలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్యుమరేషన్‌ను సాయంత్రంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ ఆదేశించారు వ్యవసాయం, ఉద్యానవనం, సెరికల్చర్, ఆక్వాకల్చర్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను అంచనా వేయాలని సూచించారు భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో విద్యుత్ శాఖ అధికారులు చేసిన కృషిని కలెక్టర్ అభినందించారు విద్యుత్ మౌలిక సదుపాయాలను దాదాపు 100 శాతం పునరుద్ధరించినట్లు తెలిపారు ప్రతి విద్యుత్ లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, లైన్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించిన తర్వాతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు జిల్లావ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పాలు, తాగునీరు, కూరగాయలు, బియ్యం, నూనె, పప్పుధాన్యాలు, ఔషధాలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా మార్కెటింగ్, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమంగా ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్‌డీటీలు, పౌరసరఫరాల శాఖ సిబ్బందితో ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసి దుకాణాలు, మార్కెట్లు, మాల్స్, తాగునీటి ప్లాంట్లను తనిఖీ చేయాలని సూచించారు.ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు అవసరమైన ప్రాంతాల్లో జనరేటర్లు, పంపులను వినియోగించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రెయిన్లను శుభ్రం చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తెలిపారు నివాస ప్రాంతాలు, రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉంటే మోటార్ పంపుల ద్వారా వెంటనే తొలగించాలని ఆదేశించారు

అనపర్తిలో గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): స్థానిక అనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ. 2 లక్షల విలువైన 4 కిలోల గంజాయితో పాటు వివిధ ప్రాంతాల్లో దొంగిలించిన 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 28న సాయంత్రం 5:30 గంటల సమయంలో అనపర్తి గ్రామం, ఐఎల్‌టీడీ జంక్షన్ సమీపంలోని కాలువ రోడ్డులో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీనిపై స్పందించిన అనపర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ వి. సుజాత తన సిబ్బందితో కలిసి మధ్యవర్తుల సమక్షంలో అక్కడ తనిఖీలు చేపట్టారు.ఆ సమయంలో బైక్‌పై అనుమానాస్పదంగా బ్యాగుతో వెళ్తున్న యువకుడిని ఆపి తనిఖీ చేయగా 4 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన నిందితుడిని అనపర్తి జీబీఆర్ కళాశాల ఎదురుగా నివసించే కొల్లాటి శ్రీ తేజ అలియాస్ డైపర్ (19) గా గుర్తించారు. అనంతరం నిందితుడిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, గంజాయి రవాణాతో పాటు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో తానే మోటార్ సైకిళ్ల దొంగ తనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో దొంగిలించిన 9 మోటార్ సైకిళ్లను పోలీసులు రికవరీ చేశారు

తుఫాన్ ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి పర్యటన



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలు, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని రామవరం, అనపర్తి, కొమరిపాలెం, పందలపాక, ఈలకొలను శివారు పల్లకడియం, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాలలో ఆయన విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం పెదపూడి మండలం ఏపీ త్రయం వద్ద ఏలేరు మరియు బిక్కవోలు డ్రెయిన్ వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బిక్కవోలు, రంగంపేట, పెదపూడి ఎంపీడీవో కార్యాలయాల్లో సంబంధిత అధికారులతో ఆయన అత్యవసర సమీక్షా సమావేశాలు నిర్వహించారు.తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో నష్ట వివరాల సేకరణ, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, మరియు ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయక చర్యల అమలు వంటి అంశాలపై అధికారులు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులను ఆదుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్‌తో 8,900 ఎకరాల్లో వరి పంటకు నష్టం



ఆలమూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట వివరాలను గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల ద్వారా అధికారులు క్షేత్రస్థాయిలో నమోదు చేస్తున్నారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్‌కేవీ చౌదరి, మండల వ్యవసాయ అధికారి బి. మీనా, గ్రామ వ్యవసాయ సహాయకులు పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.పంటను కాపాడుకునేందుకు సూచనలు: వర్షాల కారణంగా పొలాల్లో నిలిచిన నీటిని కాలువల ద్వారా వెంటనే బయటకు పంపించాలని అధికారులు సూచించారు. నేలవాలిన వరి పంటను సాధ్యమైన చోట జాగ్రత్తగా కట్టలుగా కట్టి నిలబెట్టాలని తెలిపారు. వర్షాలు తగ్గి, పిచికారీకి అనుకూల వాతావరణం ఏర్పడిన తర్వాత వరి పంటలో తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక మిల్లీలీటరు ప్రొపికోన జోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఎకరానికి 200 మిల్లీలీటర్ల మోతాదును పాటిం చాలని పేర్కొన్నారు. అదేవిధంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలో వర్షాల కారణంగా గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు) పిచికారీ చేయాలని సూచించారు. అధికారుల సూచనలు పాటించా లి: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు తమ పొలాల్లో పంట పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వంట నష్టానికి సంబంధించిన వివరాల నమోదు కొనసాగుతోందని తెలిపారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

నిడదవోలు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): 'అర్నబ్' తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో తుఫాను ధాటికి నేలకొరిగిన వరి పంటలను, తీవ్రంగా దెబ్బతిన్న అరటి తోటలను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంట పొలాలను తిరుగుతూ బాధిత రైతులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను బారినపడి నష్టపోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పూర్తి వివరాలు ప్రకటించలేమని, అయితే పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సంబంధిత అధికారుల ద్వారా నష్ట అంచనాలను సేకరించి, అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందని వివరించారు. రహదారులపై కూలిపోయిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర పనులను యంత్రాంగం నిరంతరం శ్రమించి వేగవంతం చేసిందన్నారు. బుధవారం సాయంత్రం నిడదవోలు మండలం పందలపర్రు గ్రామంలో పర్యటించానని, ప్రాథమిక అంచనా ప్రకారం అక్కడ సుమారు 600 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నియోజకవర్గంలో తుఫాను ప్రభావం పూర్తిగా తొలగి, సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు ఫోన్ లలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షిస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

తుఫాను బాధితులకు అండగా నిలవండి

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అర్నబ్' తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అక్టోబర్ 31న జరగాల్సిన తన జన్మదిన వేడుకలను రద్దు చేసుకుంటున్నట్లు అనపర్తి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవడం, వారి సమస్యల్లో భాగస్వాములు కావడం ప్రతి నాయకుడి బాధ్యతని పేర్కొన్నారు. తుఫాను కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత పరిస్థితిలో జన్మదిన వేడుకలు నిర్వహించడం సముచితం కాదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ అనపర్తికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాను బాధితులకు అండగా నిలవడమే తనకు నిజమైన జన్మదిన కానుక అని స్పష్టం చేశారు. మరొకవైపు నవంబర్ 5న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

వీరవరం ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన తోట నరసింహం



జగ్గంపేట , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో ఎస్సీ పేట కొత్తపేట ప్రాంతాల్లో తుఫాన్ కారణంగా ముంపున గురైన ప్రాంతాలను జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ మంత్రి తోట నరసింహం పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లోని పరిస్థితులను పరిశీలించిన ఆయన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు ఈ .కార్యక్రమంలో తోట బాబ్జి ,తోట వేణుగోపాలరావు, తోట వెంకటాచలం, తోట వీరబాబు, వీరవరం టు ఎంపిటిసి అభ్యర్థి వాతాడ వీరభద్రరావు ,వీరవరం వన్ ఎంపీటీసీ అభ్యర్థి నూకతట్టు కమలమ్మతో పాటు వీరవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం



గండేపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జగ్గంపేట నియోజకవర్గం, గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే శ్రీ జ్యోతుల నెహ్రూ తో కలిసి పాల్గొన్న జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి మంగిన గన్నిలక్ష్మి, ఎంపీపీ అభ్యర్థి కందుల చిట్టిబాబు, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే

అభివృద్ధికి ఓటు వేసినట్లే : పీవీఎన్ మాధవ్



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): విశాఖపట్నం నగరంలోని 88వ వార్డు గొంతినవానిపాలెం, 98వ వార్డు శ్రీనగర్, 85వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. 88వ వార్డు కూటమి అభ్యర్థి సిరసపల్లి నూకరాజుకు, 98వ వార్డు అభ్యర్థి దేనంకొండ కృష్ణంరాజుకు, 85వ వార్డు అభ్యర్థి గొర్రపాటి సునీతకు కమలం గుర్తుపై, మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పీవీఎన్ మాధవ్ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి అభ్యర్థు లకు ఓటు వేయడం ద్వారా అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాభివృద్ధికి మరింత సమన్వయంతో పనిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల మధ్య సమన్వయమే అభివృద్ధికి కీలకం అని ఆయన అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా కూటమి కృషి చేస్తుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ గొర్లె సత్యనారాయణ, సంతోష్ నాయుడు, పావని, వరహాలరావు, జాగారపు శ్రీను, కిరణ్ శర్మ, బగ్గు ఈశ్వరరావు, ప్రసాద్, గోవింద్, నాయుడు, రమాదేవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి మండలంలో 2,780 కొబ్బరి చెట్లు నేలమట్టం



కవిటి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఆర్నబ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు కవిటి మండలంలో కొబ్బరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని కవిటి, జగతి, జల్లుపుట్టుగ, ప్రగడపుట్టుగ, వరక, బెజ్జిపుట్టుగ, బల్లిపుట్టుగ, మణిక్యపురం, గోవిందపుట్టుగ, డి.గోనపపుట్టుగ తదితర గ్రామాల్లో సుమారు 1,319 మంది రైతులకు చెందిన 2,780 కొబ్బరి చెట్లు నేలకొరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఉద్యానవన శాఖ అధికారిని పోలాకి మాధవి లత తెలిపారు. తుపాను ప్రభావంతో కొబ్బరి చెట్లు నేల కొరగడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఇప్పటికే వ్యవసాయ పనులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ నష్టం మరింత భారంగా మారింది. కొబ్బరి తోటల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు సంబంధిత అధికారులు పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. నష్టానికి సంబం ధించిన వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

గంకల కవిత అప్పారావు యాదవ్ దంపతుల విస్తృత ప్రచారం



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ 58వ వార్డ్ ఇందిరా నగర్ -1,ఇందిరా నగర్ -2,ఇందిరా నగర్ -3,ఇందిరా నగర్ -4,ఇందిరా నగర్-5,ఏ ఎస్ ఆర్ నగర్ ప్రాంతంలో 58వ వార్డు కూటమి పార్టీలు బలపరిచిన బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి గంకల అప్పారావు తన సతీమణి మాజీ కార్పొరేటర్ గంకల కవిత, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ,అభిమానులతో కలిసి నాడు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డులో వలు చోట్ల వలు దేవాలయలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ తిరిగి నవంబర్ 1న జరగనున్న జీవీఎంసీ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గంకల అప్పారావు మాట్లాడుతూ కుటుంబం కన్నా ప్రజలతోనే ఎక్కువగా ఉంటానని గంకల హామీ ఇచ్చారు. వార్డు పర్యటనలో భాగంగా మురికివాడలో దీర్ఘకాలిక సమస్యలపై ప్రజలు వినతి అందజేశారని,గెలవగానే దీర్ఘకాలిక సమస్యలు అయ్యినటువంటి డ్రైనేజీ,రోడ్లు,కళ్యాణ మండపాలు, పార్కులు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.రానున్న ఎన్నికలలో కమలం గుర్తుపై తనకు ఓటు వేసి, సైకిల్ గుర్తుపై మేయర్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించి వార్డును మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిత్యం గుడ్ మార్నింగ్ గంకల,గుడ్ మార్నింగ్ గంకల 2.0 కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటానని రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.గంకల అప్పారావును గెలిపించుకొని కౌన్సిల్ కు పంపి వార్డును అభివృద్ధి చేసుకుంటామని వార్డు ప్రజలు అంటున్నారు.కూటమి నాయకులు ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమినేతలు,అభిమానులు ఉన్నారు..

డాబా గార్డెన్స్ సెల్ పాయింట్ సెల్ షాప్ లో భారీ చోరీ



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): నగరంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి డాబా గార్డెన్స్ లో సెల్ పాయింట్ సెల్ షాప్ లో భారీ చోరీ జరిగింది. నగరంలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దొంగలు ఇదే అదునుగా సెల్ పాయింట్ సెల్ షాపు వెనుక షట్టర్లను కట్ చేశారు. షటిల్ కట్ చేసి సెల్ షాప్ లో దూరి అందులో విలువైన ఐఫోన్ సెల్ ఫోన్లు 35... అదేవిధంగా విలువైన మరికొన్ని సెల్ఫోన్లను దొంగలు దోచుకున్నారు... ఉదయం షాపు తెరిచిన తర్వాత దొంగతనం జరిగిందని విషయాన్ని సిబ్బంది తెలుసుకున్నారు. దీంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో సెల్ పాయింట్ మేనేజర్ దొంగతనంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో సుమారు 50 లక్షల విలువైన సెల్ ఫోన్లు దొంగతనంకి గురైనట్లు ఫిర్యాదు చేశారు.. అయితే టూ టౌన్ పరిధిలో ఇంత పెద్ద మొత్తంలో భారీ దొంగతనం జరిగినప్పటికీ ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా పోలీసులు ఉంచారు. ఇంత భారీ మొత్తంలో సెల్ ఫోన్లు చోరీకి గురి కావడంతో షాపు యజమానులు కష్టంలో ఉన్నారు.

అనపర్తిలో నాలుగు మండలాలు పర్యటించిన నల్లమిల్లి



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : ఆర్నబ్ తుఫాన్ కారణంగా అనపర్తి నియోజకవర్గంలో దెబ్బతిన్న పంట పొలాలు,వృక్షాలు, కరెంటు స్తంభాలుపరిశీలించిన అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి. ఓప్రక్క వాన కురుస్తున్నప్పటికీ ఆయన నాలుగు మండలాలు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఈ కష్టకాలంలో ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే నల్ల మిల్లి భరోసా ఇచ్చారు. కూటమి నాయకులంతా ప్రజలకు అండగా ఉండాలని ఆదేశించారు. రంగంపేట మండలం ఈలకొలను శివారు పల్లకడియం, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాలలో పంట పొలాలను, విరిగిన కరెంట్ స్తంభాల ను శాసనసభ్యులు నల్లమిల్లి పరిశీలించారు. రంగం పేట ఎంపిడిఓ కార్యాలయంలోఅధికారులతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే నల్ల మిల్లి నిర్వహిం చారు.బిక్కవోలు లో పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను నల్లమిల్లి పరిశీలించారు. పెదపూడి మండలం ఏపిత్రయం బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలిం చారు. అనపర్తి మండలం లక్ష్మినర సావురం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీటి సమస్యను గుర్తించి 1000 మంచి నీరు బాటిల్స్ ను ఎమ్మెల్యే నల్లమిల్లి అందజేశారు. నియోజ కవర్గ వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతు లను ప్రభుత్వం ఆదుకుంటుం దని శాసన సభ్యులు నల్లమిల్లి హామీ ఇచ్చారు.ఆయన వెంట అధికారు లు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం



సీతానగరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఇందులో భాగంగా సీతానగరం మండలం చిన్నకొండెపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. మండల జడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థులు చిన్నకొండెపూడి గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓటర్లను నేరుగా కలిశారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అలుపెరుగని కష్టమే తమ విజయానికి శ్రీరామరక్ష అని చాటుతూ, నాయకులు ప్రచారం చేసారు.నవంబర్ 5న జరగనున్న ఎన్నికలలో ఓటర్లందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని, తమ అమూల్యమైన ఓటును 'గాజు గ్లాసు' గుర్తుపై వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. శ్రేణుల మద్దతు,ప్రజల నుండి వచ్చిన విశేష స్పందనతో ప్రచారం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, వీర మహిళలు, పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు
వేగవంతం చేయాలి : కమిషనర్ రాహుల్ మీనా



రాజమహేంద్రవరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : నగరంలో పారిశుధ్య చర్యలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. ఉదయం హైటెక్ బస్టాండ్, డీలక్స్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు సహా పలు ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లపై నిలిచిన నీటిని, ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా మోటర్ల సాయంతో తొలగించాలన్నారు. అలాగే వాహనదారులు, పాదచారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాయంత్రం లోపు రహదారులపై ఉన్న చెట్ల కొమ్మలు, వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అనంతరం క్వారీ మార్కెట్ లోని వెహికల్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా యార్డులో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, మూవ్ మెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్ని వాహనాలు వినియోగంలో ఉన్నది.ఎంత మంది డ్రైవర్లు అందుబాటులో ఉన్నారో. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాహ నాల కండిషన్ ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని.. మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే చేయించి వారం రోజుల్లోగా వాహనాలన్నింటినీ పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం నల్లా ఛానల్, ఎన్ఆర్సీపీ పంపింగ్ స్టేషన్ లను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఉన్నారు.

అర్నబ్ తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



అలమూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : అర్నబ్ తుఫాన్ సృష్టించిన బీభత్సానికి పంట దెబ్బతిన్న రైతులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు. ఆయన కొత్తపేట నియోజకవర్గ పరిధి లోని పెనికేరు, పినపల్ల, చింతలూరు, సూర్యా రావుపేట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులు, కౌలు రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ.. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన పంటలు చేతికి వచ్చే సమయంలో తుఫాన్ పాలవ్వ డం అత్యంత బాధాకరమన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎలాంటి వివక్ష లేకుండా పంట నష్టాన్ని సమగ్రం గా అంచనా వేయాలని అలాగే యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుని పరిహారం మంజూరు ప్రక్రియలో జాప్యం చేయకుండా ప్రభుత్వం తక్షణ మే ఆర్థిక సాయం అందించి రైతన్నకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోరాడ తామని ఆయన హామీ ఇచ్చారు.ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ నాయకులు చల్లా ప్రభాకరరావు, తమ్మన శ్రీనివాస్,చామకూరి శ్రీను, గంటా శ్రీనివాస్ , పాలంగి ఉమాదేవి తదితరులు ఉన్నారు.

ట్యాంకర్ ద్వారా త్రాగునీరు సరఫరా

ఆలమూరు , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : అర్నబ్ తుఫాను ప్రభావంతో ఆలమూరు గ్రామంలోని ఎర్ర కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కూటమి నాయకు లు ముందుకు వచ్చారు. స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విష యాన్ని గుర్తించి, ఈదల రాంబాబు ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పంపిణీ చేశారు.తుఫాను కారణంగా ఏర్పడిన ఇబ్బందుల నేపథ్యంలో కాలనీ ప్రజలకు తాగునీరు అందించాలనే ఉ ద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో భాగంగా నీటి సరఫరా చేపట్టి స్థానికులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమం లో ఈదల నల్లబాబు, రావాడ సత్తిబాబు, వంటిపల్లి సతీష్,శిరిగినీడి పట్టాభి,మానేపల్లి శీను, చీపురుపల్లి గణేష్, వంటపాటి అర్జున్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బహుదా నది వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ



శ్రీకాకుళం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : తుఫాన్ ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాతో పాటు ఎగువ ప్రాంతమైన ఒడిశా రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బహుదా నది వరద నీరు ఇచ్ఛాపురం పరిధిలోని కొజ్జిరియా (బెళ్ళుపడ) టోల్ గేట్ సమీపంలో పేటూరు వద్ద జాతీయ రహదారిపైకి చేరుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితుల ను పరిశీలించారు. అక్కడ డ్రోన్ కెమెరాల ద్వారా వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ,జాతీయ రహదారిపై ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. వాహనదారులు, ప్రయాణికుల భద్రతకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పోలీసు, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని స్పష్టం చేశారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, రహదారిపై ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.వరద నీరు ప్రవహిస్తున్న రహదారులపై ప్రయాణిం చవద్దని, నీటి లోతు, ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేని పరిస్థితుల్లో వాహనాలతో దాటేందుకు ప్రయత్నిం చవద్దని జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అనవసర ప్రయాణాలను నివారించాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు హెచ్చరిక లను తప్పనిసరి గా పాటిస్తూ, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద ముప్పు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులు సూచించినప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసు లేదా రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ పరిశీలనలో జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల శిక్షణకు
డుమ్మా..ఏడుగురు సిబ్బందికి సస్పెన్షన్ షోకాజ్ నోటీసులు

విజయనగరం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే రెండు విడతల శిక్షణా కార్యక్రమాలను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. సముచిత కారణాలతో ముందస్తు అనుమతి పొంది శిక్షణకు హాజరుకాని సిబ్బందిని మినహాయించి, ఎలాంటి సహేతుకమైన కారణం లేకుండా రెండు శిక్షణా కార్యక్రమాలకు గైర్హాజరైన ఏడుగురు సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ ఉపక్రమించారు. ఇందులో భాగంగా ఎన్నికల నిబంధనల ప్రకారం వారిని ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్ పర్యటన



దేవరాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో దేవరాపల్లి ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్ వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు .నాగయ్యపేట శివారు సీతంపేట ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిలిచిపోయి కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలుసు కుని, అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే నీటిని తొలగించి సమస్యను పరిష్కరిం చాలని పంచాయతీ కార్యదర్శి సుమిత్రకు ఆదేశించారు. తామరబ్బ వద్ద శారదా నది వంతెనపై వరద నీరు ప్రవహిస్తుం డటంతో అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు వంతెన దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.చింతలపూడికి వెళ్లే విద్యుత్ స్తంభం వాగులో పడిపోవడంతో, వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఎలక్ట్రికల్ ఏఈ ఆర్. సన్యాసి నాయుడుకి ఆదేశాలు జారీ చేశారు.గ్రామాల్లో వర్షపు నీటితో ప్రజలు ఇబ్బంది పడితే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సహాయం కోసం సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.ఈ పర్యటనలో ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో అనంత ఉమాదేవి, ఎలక్ట్రికల్ ఇన్చార్జి ఏ ఈ,పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ పి.వి.పి. త్రినాథ్ పాల్గొన్నారు.

వరుదు కళ్యాణి ని గెలిపించుకోవాలి



తగరపువలస , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : తగరపు వలస, భీమిలిలో వైఎస్సార్సీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి గెలుపు కోసం అలాగే కార్పొరేట ర్లు గెలుపు కోసం తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ మధ్యాహ్నం తగరపువలసలో ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లా డుతూ.. విశాఖపట్నం నగరం లోని ప్రజా ఆస్తులను పరిరక్షిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ పేర్కొన్నారు. విశాఖ ను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పే పాలకులు, ముందుగా నగర ప్రజల ఆస్తులు, హక్కులు, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా విశాఖ అభివృద్ధికి ఎంతోమంది నాయ కులు, కార్మికులు, సామాన్య ప్రజలు కృషి చేశారని, వారి శ్రమతో రూపుదిద్దుకున్న నగర సంపదను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రజలకు చెందాల్సిన భూములు, ప్రభుత్వ ఆస్తులు, అభివృద్ధి నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా ఆస్తులకు సంబంధించి ఎలాంటి అక్రమా లు జరిగినా వాటిపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుం చాలని కోరా రు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సహాయం, న్యాయమైన నష్టపరిహారం అందించాలని, బాధితులను రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాకుండా, వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీలు, వ్యక్తులకు అతీతంగా ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, ప్రజలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగిస్తాం" అని బి.వి.రామ్ స్పష్టం చేసినట్లు తెలిపారు.

టీడీపీ మేయర్ అభ్యర్థి డమ్మీ మాత్రమే: తెలుగు శక్తి

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణిపై, అలాగే ఎంపీ భరత్ పాత్రపై తెలుగు శక్తి తీవ్ర విమర్శలు చేశారు. కూటమి తరపున ముక్కా శ్రావణిని కేవలం డమ్మీ అభ్యర్థిగా నిలబెట్టారని, అసలు నిర్ణయాలు మరొకరి చేతుల్లోనే జరుగుతున్నాయనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయని ఆరోపించారు. విశాఖ నగర అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లగల నాయకత్వం వైసీపీకే ఉందని పేర్కొన్నారు. నగర సమగ్రాభివృద్ధి కోసం జీవీఎంసీ మేయర్‌గా వైసీపీ అభ్యర్థి వరుదు కళ్యాణిని అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత విశాఖ ప్రజలపై ఉందని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జీవీఎంసీ 2వ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి అక్కరమాని రామునాయుడు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి జీరు వెంకట రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, భీమిలి నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సీనియర్ నాయకులు నమ్మి లక్ష్మణ్ రావు తెడ్డాపు అప్పలరాజు, కంచుబోయిన వెంకటరావు, డాక్టర్ పప్పూర్ నికుంజ్, తదితరులు పాల్గొన్నారు.

తుఫాను ముంపు పొలాల్లో అధికారుల పర్యటన..నష్ట తీవ్రతపై రైతుల ఆందోళన



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త) : అనపర్తి మండలం కోప్పవరం గ్రామంలో 'అర్నాబ్' తుఫాను ప్రభావిత వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేశ్వరావు శాస్త్రవేత్తల బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. తుఫాను తీవ్రత తగ్గిన తర్వాత కోతకు సిద్ధంగా ఉండి ముంపునకు గురైన వరి పంటలను పరిశీలించి,పంట నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను మరియు సాంకేతిక యాజమాన్య పద్ధతులను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... తూర్పుగోదావరి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల నేపథ్యంలో వరి పంట ప్రస్తుతం పూత,పాలు పోసుకునే మరియు కోత దశలలో ఉందన్నారు.పూత దశలో ఉన్న ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల పంటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చేలలో నీరు నిలబడితే తాలు గింజలు ఏర్పడి, ధాన్యం రంగు మారటంతో పాటు మానిపండు, మాగుడు తెగుళ్లు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు వీలైనంత వరకు పొలం నుండి వర్షపు నీటిని అంతర్గత కాలువల ద్వారా ఎప్పటికప్పుడు బయటకు పంపాలని సూచించారు. పాలు పోసుకునే దశలో ఉన్న స్వర్ణ, సంపద స్వర్ణ రకాల వరి చేలు వర్షాలకు పడిపోతే,వాటిని వెంటనే పైకి లేపి కట్టుకోవాలని, తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మి.లీ. ప్రొపికోనాజోల్ మందును పిచికారీ చేయాలని స్పష్టం చేశారు.నిరంతర వర్షాల వల్ల గింజల్లోని నిద్రావస్థ తొలిగి కంకిపైనే మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు.కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే,నీరు బయటకు తీసివేసిన తర్వాత వెంటనే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు చొప్పున కలిపి) పంటపై పిచికారీ చేయాలని,ఇది గింజలు మొలకెత్తడాన్ని మరియు రంగు మారడాన్ని సమర్థవంతంగా అడ్డుకుంటుందని తెలిపారు. రైతులందరూ వీలైనంత త్వరగా వరి కోతలు మొదలు పెట్టాలని, వ్యవసాయ శాఖ సిబ్బంది అంతా త్వరగా పంట నష్టాల ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా,ఈ పర్యటనలో స్థానిక రైతులు జిల్లా వ్యవసాయ అధికారికి తమ సమస్యలను విన్నవిస్తూ, ప్రస్తుతం వర్షాల వల్ల అత్యవసరంగా కోతలు కోయాల్సి వస్తున్నందున వరి కోసే మిషన్ల ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే తుఫానుకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా ఎలాంటి నిబంధనలు పెట్టకుండా అన్ని మిల్లుల్లో కొనుగోలు చేసే విధంగా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో అనపర్తి ఏడీఏ డీవీ.కృష్ణ,డాట్ (డి ఎ ఎ టి)శాస్త్రవేత్త డా.మానుకొండ శ్రీనివాస్, మారుటేరు శాస్త్రవేత్త డా. ఎస్. దయాకర్ రావు, రాజమండ్రి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డా. డి.సుధాకర్ రావు,డా. సిహెచ్. సునీత,అనపర్తి మండల వ్యవసాయ అధికారి బి.సురేష్ కుమార్,ఏఈఓలు, వీఏఏలు మరియు రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అనపర్తి మండలం లో కూటమి అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది



అనపర్తి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అనపర్తి మండలంలో స్థానిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థులు అనపర్తి సావరం ప్రాంతంలో 6వ వార్డు అభ్యర్థిని కర్రి శేషారత్నం ,7వ వార్డు అభ్యర్థి మేడిశెట్టి అర్జున రావు ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై,తమకు మద్దతు తెలిపి ఓటు వేయాలని అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన అభ్యర్థులు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారితో మాట్లాడారు. తమకు అవకాశం కల్పిస్తే వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని వివరించారు. స్థానిక అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఓటర్లకు తెలిపారు.ఈ సందర్భంగా తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి, తమకు మద్దతు తెలిపి అఖండ మెజార్టీతో గెలిపి ంచాలని అభ్యర్థులు ప్రజలను కోరారు. అలాగే జెడ్ పి టి సి అభ్యర్థి వాసంశెట్టి నాగేశ్వరరావు కు కూడా ఓటు వేయమని కోరారు.ఇంటింటా ప్రచారం ద్వారా ఓటర్లను నేరుగా కలుసుకుంటూ తమ ఎన్నికల గుర్తును పరిచయం చేస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు.ఈ ప్రచార కార్యక్రమం లో అనపర్తి సావరం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డతీగలలో విస్తృతంగా బ్లీచింగ్ పౌడర్ పిచికారీ



అడ్డతీగల , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఇటీవల విరుచుకు పడిన 'అర్నాబ్' తుఫాన్ ప్రభావం తగ్గి వాతావరణం శాంతించడంతో, అడ్డతీగల గ్రామ పంచాయతీ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పారిశు ధ్య పునరుద్ధరణ పనులను వేగవంతం చేసింది. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, నీటి నిల్వల దృష్ట్యా గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది గ్రామంలోని అన్ని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు మరియు లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా వర్షపు నీరు చేరి మురుగు నిలిచిపోయిన ప్రతి డ్రైనేజీ కాలువలోనూ పూడికతీత అనంతరం పెద్దఎత్తున బ్లీచింగ్, సున్నం పిచికారీ చేయించారు. దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ మరియు విష జ్వరాలు ప్రబలకుండా పూర్తి స్థాయి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

వర్షాకాలం, తుఫాన్ల అనంతర పరిస్థితుల్లో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున, ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పంచా యతీ ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టింది. ఈ సందర్భంగా పంచాయతీ అధికా రులు మాట్లాడుతూ, ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లా ర్చిన నీటినే తాగాలని సూచించారు. ఎవరికైనా జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదిం చి, వైద్య సేవలు పొందాలని గ్రామాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడంలో ప్రజ లందరూ సహకరిం చాలని అధికారులు కోరారు.

తుఫాన్ బారిన పడిన పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



అడ్డతీగల , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): అడ్డతీగల మండలంలో ఆర్నాబ్ తుఫాను వలన రెండు రోజులుగా దాదాపు 150 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అడ్డతీగల మండల సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి , మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ క్షేత్ర పర్యటన నిర్వహి ంచారు. దీనిలో భాగంగా తిమ్మా పురం, గొంటు వానిపాలెం, కొత్తూ రు, వీరవరం గ్రామాల్లో పర్యటిం చారు. వరి,పత్తి , మినప చేలను పరిశీలించారు. అనంతరం వ్యవసా యాధికారులు మాట్లాడుతూ పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకో వాలని, పత్తి , మినప చేలలో నీరు బయటకు వెళ్ళిపోయే విధంగా మార్గాలు చేసుకోవాలని సూచించారు. పంటలకు పురుగు తెగుళ్లపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

తప్పుడు పోస్టులు పెడితే సహించేది లేదు



తూర్పుగోదావరి జిల్లా , జగ్గంపేట , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): రంపచోడవరం, రాజానగరం నియోజకవర్గ పరిసర ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు, కోట్లాది రూపాయలు ఆలయాల అభివృద్ధికి నిరుపేదలకు ఖర్చు చేస్తూ ఆయా ప్రాంతాల్లో బీజేపీ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంబాల శ్రీనివాసరావుపై తప్పుడు పోస్టులు పెడితే సహించేది లేదంటూ బీజేపీ శ్రేణులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిస్వార్థంగా సేవలందిస్తూ, సమా జ సేవ విస్తృతంగా చేస్తున్న కంబాల శ్రీనివాసరావు ఎదుగుదలను, ఆయనకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక, కొంతమంది పనిగట్టుకుని సోషల్ మీడియాలో ఆయనపై నిరాధారమైన, తప్పుడు ప్రచారాలు చేస్తుండడం చాలా దారుణమని అన్నా రు. దీనిపై గోకవరం, కోరుకొండ, రాజానగరం ప్రాంతానికి చెందిన బీజేపీ శ్రేణులు, అభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఏపీ ఆర్ చౌదరి (బీజేపీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి) పేరుతో సోషల్ మీడియాలో కంబాల శ్రీనివాసరావుపై పెట్టిన పోస్ట్ పూర్తిగా అవాస్తవం మరియు కల్పితంమని బీజేపీ శ్రేణులు, కంబాల శ్రీనివాసరావు అభిమానులు, కార్యకర్తలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక మీదట అవాస్తవాలు, అద్భుత కల్పనలతో కంబాల శ్రీనివాసరావు పై పోస్ట్ పెడితే సహించేది లేదంటూ కంబాల అభిమానులు మండిపడు తున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉ ంటూ, ఆయన చేస్తున్న విస్తృతమైన సేవా కార్యక్రమాలను చూసి ఓర్వలేని కొందరు వ్యక్తులు కుట్ర పన్నుతున్నారనీ బీజేపీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి తన విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయనే ఉ ద్దేశంతో సేవా తత్పరుడైన కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి మద్దతు కోరి, ఆయనకు వచ్చిన బీ-పారంతో కంబాల శ్రీనివాసరావు సమక్షంలో ఫోటోలు దిగడం జరిగిందనీ. దీన్ని కూడా వక్రీకరించి, ఏదో పెద్ద తప్పు జరిగిందంటూ సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు సృష్టించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అంటూ ప్రకటనలో వారు ఖండించారు. బీజేపీ పార్టీలో కంబాల శ్రీనివాస రావుకి ఉన్న పేరును, పరువును దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారనీ. ఇలాంటి అనత్య ప్రచారాలను పార్టీ శ్రేణులు, ప్రజలు ఎవరూ నమ్మవద్ద ని బీజేపీ శ్రేణులు, కంబాల అభిమానులు కోరుతున్నారు. భవిష్యత్తు లోనూ ఇలాంటి తప్పుడు ప్రచారాలు కొనసాగిస్తే, సంబంధిత వ్యక్తులపై పరువు నష్టం దావాలతో పాటు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ సందర్భంగా కార్యకర్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో గంటా భేటీ



విశాఖపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాల నమోదు కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కూటమి నాయకులు నిర్ణయించారు. జీవీఎంసీ సహా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఆమోద యోగ్యమైన రీతిలో సీట్ల సర్దుబాటు జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు పీవీఎన్ మాధవ్, జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు బుధవారం భేటీ అయ్యారు. కూటమి స్ఫూర్తిని కొనసాగిం చేలా క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను కార్యోన్ముఖం చేయాలని నిర్ణయించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగు తీయిస్తున్న ప్రభుత్వానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు ఉందని, ఎన్నికల ఫలితాల్లో అది ప్రతిబింబించనుందని పేర్కొన్నారు. విశాఖకు గూగుల్, ఐటీ, టూరిజం ప్రాజెక్టులు తరలి వస్తున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉ పాధి అవకాశాలు రాబోతు న్నాయన్నారు. జాబితా ప్రకటించే వరకు మాత్రమే కింది స్థాయిలో నాయ కులు, కార్యకర్తల మధ్య సీట్ల సర్దుబాటులో అసం తృప్తి ఉంటుందని, తుది ఎంపిక తర్వాత ఎన్నికల్లో కలసి పని చేయడంపై ఎలాంటి అపోహలకు తావుండదని వెల్లడించారు. భీమిలి నియోజకవర్గం జీవీఎంసీ పరిధిలోని 12 వార్డులు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాల్లో 3 జెడ్పీటీసీ, 44 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడానికి కూటమి శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

అనకాపల్లి జిల్లా జలాశయాలు ఫుల్



దేవరాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అనకావల్లి జిల్లాలోని జలాశయాలన్నీ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని ఇరిగేషన్ ఈఈ ఏ. త్రినాథం తెలిపారు. రైవాడ జలాశ యాన్ని పరిశీలించిన ఆయ న అనం తరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రధాన జలాశయమైన రైవాడలో ప్రస్తుత నీటిమట్టం 111.80 మీటర్లకు చేరిందని, గరిష్ట మట్టం 114 మీటర్లు కాగా 2 మీటర్ల ఖాళీ మాత్రమే ఉ ందన్నారు. జలాశయానికి 15 వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తోందన్నారు .ముందు జాగ్రత్తగా కొణాం నుంచి 1000 క్యూసెక్కులు, పెద్దేరు నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామ న్నారు. రైవాడ 113.50 మీటర్లు దాటితే శారదా నదిలోకి నీటిని వదులుతామని తెలిపారు.నవంబర్ 1, 2 తేదీల్లో బంగాళాఖాతంలో మరో తుఫాను పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఆ ప్రభావం ఉంటే అన్ని జలాశయాల నుంచి భారీ వరద వదలాల్సి వస్తుందన్నారు. కావున శారదా పరివాహక దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, అనకాపల్లి లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఆయన వెంట డిఈఈ సత్యం నాయుడు, జలాశయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ శిఖరాల వైపు వైసిపి అభ్యర్థి సరోజిని

అనకాపల్లి , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): పట్టణంలోని గవరపాలెం 108 వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేడ సరోజిని విజయ శిఖరాల వైపు దూసుకుపోతున్నారు .. ఆమె భర్త వార్డు ఇన్చార్జి పట్టణ వైసిపి ప్రధాన కార్యదర్శి బొడ్డేడ శివ అత్యంత ప్రతిష్టాత్మకంగా గెలుపుకు పని చేస్తున్నారు. సవాల్గా తీసుకొని పనిచేసుకుపోతున్నారు ఎక్కడ రాజీ పడటం లేదు. సరోజినీ అత్త గత 28వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా పనిచేసిన బొడ్డేడ దుర్గ లక్ష్మి సేవలు విజయ శిఖరాలకు మరింత దగ్గర చేస్తున్నాయి.వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలన... వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ సరోజిని విజయానికి సహకరిస్తామని హామీ ఇస్తున్నారు..ఇప్పటికే ఒక దప ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేశారు. మైకు ప్రచారం హోరెత్తుతుంది... ఇంటింటి. ప్రచారం అనంతరం ఒక్కొక్కరు ఒక్కొక్క వైపు ప్రముఖులను కలుస్తూ ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు.. అత్త దుర్గ లక్ష్మి ఎన్టీఆర్ స్టేడియం రావడంలో విశేష కృషి చేశారు..అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ రావటంలో కూడా ఆమె పాత్ర కీలకం. సంఘసంస్కర్తగా ఆమె అప్పటినుండి ఇప్పటివరకు ఆమె చేస్తున్న సేవలు ప్రజలకు సుపరిచితం.. కుటుంబం.. పార్టీ బలం.. కలిసి వస్తున్నాయి.. బాలాజీరావుపేట, రామానాయుడు కాలనీ లో రోడ్లు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి అంటే ఆమె చలువే.. కష్టం వస్తే ఆమె చేస్తున్న సేవలు సరోజినీ గెలుపుకు బాటలు వేస్తున్నాయి..శివ రెండేళ్లుగా పోటీని దృష్టిలోపెట్టుకుని విస్తృతమైన అనుచర వర్గాన్ని తయారు చేశారు.. వారంతా ఇప్పుడు పనిచేస్తున్నారు.. కూటమిలో సవాల్ ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు.. వ్యాపారవేత్తగా గుర్తింపు కలిగిన శివకు కుటుంబం బంధుత్వాలు కలిసి వస్తున్నాయి

క్రైస్తవ సోదరుల కోరిక నెరవేరుస్తాం : ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి, అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవ సోదరులు, పాస్టర్ల చిరకాల కోరిక అయిన పాస్టర్స్ ఫెలోషిప్ భవనాల నిర్మాణానికి ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుం టుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన అనపర్తి మండల పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాస్టర్ల సౌకర్యార్థం ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి నాలుగు మండలాల్లో భవనాలు నిర్మిస్తామన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటిగా బిక్కవోలులో స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందని, దీనిని మత పెద్దలు పరిశీలించి, ఆమోదం తెలిపారని వెల్లడించారు.ఈ స్థల కేటాయింపుతో పాటు భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని,మిగిలిన మూడు మండలాల్లోనూ దశలవారీగా ప్రదేశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించిన విజయరావుకి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో క్రైస్తవ సోదరులంతా తమ ఆశీర్వాదాలు అందించి నన్ను 20 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించారని ఆయన కొనియాడారు.అభివృద్ధి విషయానికి వస్తే, గత 2014-19 మధ్యకాలంలో తాను ఐదేళ్లలో రూ. 800 కోట్ల అభివృద్ధి పనులు చేపడితే,ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో కేవలం ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే అనూహ్యంగా రూ. 1200 కోట్ల రూపాయల నిధులతో రికార్డు స్థాయి పనులను పూర్తి చేశామని వివరించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాలలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందని, రాబోయే పరిషత్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలోకి వచ్చి "త్రిబుల్ ఇంజన్ సర్కార్"గా మారుతుందని చెప్పారు. దీనివల్ల 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి వచ్చే రూ. 25 వేల కోట్ల అదనపు నిధులను గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ద్వారా గ్రామాల్లో మరింత మెరుగైన అభివృద్ధికి వెచ్చించే వెసులుబాటు కలుగుతుందన్నారు. తాను ఎక్కడా మత భేదాలకు తావు లేకుండా పూర్తి లౌకిక విధానంతోనే పరిపాలన సాగిస్తున్నానని, కొందరు బిజెపిపై మతతత్వ ముద్ర వేయాలని చూస్తున్నా క్రైస్తవ ప్రాధాన్యత కలిగిన ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి విజయవంతంగా పాలన సాగించడమే ఆ పార్టీ లౌకికత్వానికి నిదర్శనమని గుర్తుచేశారు. రాబోయే పరిషత్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులందరికీ పాస్టర్లు, క్రైస్తవ సోదరులంతా తమ అమూల్యమైన ప్రార్థనల ద్వారా ఆశీర్వచనం అందజేసి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, కూటమి జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ జట్టుకు కోలా బాగ్యేష్



భీమునిపట్నం , అక్టోబర్ 30 (గ్లోబల్ వార్త): జాతీయ స్థాయి అండర్ 17 ఫుట్ బాల్ జట్టుకు విశాఖ పట్నం జిల్లా నుండి భీమునిపట్నం మండలానికి చెందిన కోలా బాగ్యేష్ ఎంపికయ్యాడు. నవంబర్ 1 నుండి బలియా (యూపీ)లో జరగనున్న జాతీయ పోటీలకు రాష్ట్రం తరపున కోలా బాగ్యేష్ ఆడనున్నాడు. తల్లి దండ్రులు ఇద్దరూ పీడీ ఉపాధ్యాయులు కావడం తో కుమారుడు భాగ్యేష్ ను చిన్నప్పటినుండి ఫుట్ బాల్ లో కోచింగ్ ఇచ్చారు. తండ్రి అందించిన తోడ్పాటు, స్ఫూర్తి తో బాగ్యేస్ ఫుట్ బాల్ క్రీడలో అంచె అంచెలుగా అసమాన ప్రతిభను సొంతం చేసుకొని టీమ్ కు కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించి జిల్లా, రాష్ట్ర స్థాయి లలో నిర్వహించిన పలు టోర్నమెంట్ లలో టీం ను గెలిపించి విజయ తీరాలకు చేర్చారు. ఇటీవల పశ్చిమ గోదావరి, రాజమండ్రి వేదికలుగా ఈనెల 11, 12, 13 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు ఘన విజయం సాధించి, రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఎంపిక చేశారు.

ఈ ఎంపికలో తాళ్లపలస లోని ప్రముఖ తిరుమల స్కూల్ లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కొల భాగ్యేస్ తన అసాధారణ ఆటతీరుతో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది : నిర్మలా సీతారామన్

ఒకటి తరువాయి

బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

అండమాన్ సముద్రంలో అల్పపీడనం

ఒకటి తరువాయి

ప్రయా ణిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ అల్పపీడనం అక్టోబర్ 31వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ఒక వాయుగుండంగా కేంద్రీకృతం కానుంది. వాయుగుండంగా మారిన తర్వాత కూడా ఇది పశ్చిమ వాయవ్య దిశలోనే తన ప్రయాణాన్ని కొనసాగించి, రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వాతావరణ పరిణామం ప్రభావంతో రానున్న రోజుల్లో ఏపీ తీర ప్రాంతాల్లో వాతావరణం మారే అవకాశం ఉంది. దీని కదలికలను, తీవ్రతను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేసే అవకాశం ఉంది. వాయుగుండం తీరానికి ఎంత దూరంలో కేంద్రీకృతమవుతుంది, దాని ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందనే దానిపై రానున్న 48 గంటల్లో మరింత స్పష్టత రానుంది.

ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు ముగిసిన ప్రచారం..ఎల్లుండే పోలింగ్

ఒకటి తరువాయి

ర్యాలీలు, బహిరంగ సభల సందడి సాయంత్రం 5 గంటలతో ముగిసింది. నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరగనుండగా, నిబంధనల ప్రకారం 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేశారు. ఈ ఎన్నికల పోలింగ్‌కు ముందే అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ విజయాన్ని నమోదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 17 మున్సిపల్ ఛైర్మన్ పదవులను కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. వీటిలో టీడీపీ 15 స్థానాలు గెలుచుకోగా, జనసేన, బీజేపీ చెరొక స్థానంలో గెలుపొందాయి. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలో 6 పట్టణ స్థానిక సంస్థలు అధికార కూటమి ఖాతాలో చేరడం గమనార్హం. ఛైర్మన్ పదవులే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా 21 శాతానికి పైగా వార్డులు, 12 శాతానికి పైగా డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. 13 కార్పొరేషన్ల పరిధిలోని 922 డివిజన్లకు గాను 118 డివిజన్లలో పోటీ లేకుండానే కూటమి అభ్యర్థులు గెలుపొందారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, ప్రొద్దుటూరు, కమలాపురం, రాయచోటి వంటి అనేక చోట్ల ఛైర్‌పర్సన్‌తో సహా అన్ని వార్డులూ ఏకగ్రీవం కావడం కూటమి ప్రభావాన్ని స్పష్టం చేస్తోంది. ఇక, నవంబర్ 1న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్ఠమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36,351 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలు, వీడియో నిఘాతో పాటు వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నవంబర్ 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రచారం ముగియడంతో ఇక అందరి దృష్టి నవంబర్ 1న జరిగే పోలింగ్‌పై, ఆ తర్వాత 3న వెలువడనున్న ఫలితాలపైనే నిలిచింది.

చొక్కా మడత పెడతారా? : దేవినేని ఉమా

ఒకటి తరువాయి

శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్‌పై విరుచుకుపడ్డారు. చొక్కా మడతపెట్టాల్సింది ప్రజల మధ్య కాదని, తాడేపల్లి, ఇడుపులపాయ లేదా బెంగళూరు ప్యాలెస్‌లలో మడత పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. "తోలు ఒలుస్తా, తొక్క తీస్తా అంటూ అధికారులను బెదిరించే జగన్ మాటలు పిచ్చి ప్రేలాపనలు తప్ప మరొకటి కాదు. రాష్ట్రవ్యాప్తంగా 2,043 ఎంపీటీసీ, 77 జెడ్పీటీసీ స్థానాల్లో నామినేషన్లు వేయలేని పార్టీ వైసీపీ. గతంలో ఏ నియోజకవర్గంలో నామినేషన్లు వేయలేకపోతే అక్కడి ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వనని జగనే చెప్పారు. మరి పులివెందుల ఎమ్మెల్యే అయిన జగన్‌కు ఇప్పుడు టికెట్ ఉందా?" అని దేవినేని ఉమా సూటిగా ప్రశ్నించారు. అర్నబ్ తుపానుతో రాష్ట్రం అల్లకల్లోలమవుతుంటే, బాధితులను ఆదుకోవాల్సిన ప్రతిపక్ష నాయకుడు అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ఆయన కుట్ర రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తుపాను వస్తే జాతీయ రహదారిపై పరదాలు, షామియానాలు కట్టుకుని సమీక్షలు చేసిన జగన్‌కు, క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. రైతులు నీళ్లలో నిలబడి గోడు వెళ్లబోసుకుంటుంటే, పరదాల చాటు నుంచి పాలన చేసిన వ్యక్తి ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టుల గురించి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, టీడీపీ హయాంలో రూ.68 వేల కోట్లతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పునాదుల మీదే జగన్ ఐదేళ్లు నీళ్లు నడిపించారని గుర్తుచేశారు. పట్టిసీమను 'ఒట్టి సీమ' అని, పంపులు పీకేస్తానని చెప్పిన జగన్, తన పాలనలో అదే ప్రాజెక్టుతో నీళ్లు ఇవ్వాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. పురుషోత్తపట్నం, వైకుంఠపురం వంటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కేసులు వేయించి, కోర్టుల చుట్టూ తిప్పి రైతాంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు.

తుపాను బాధితులకు ప్రభుత్వ అండ

ఒకవైపు జగన్ విమర్శలతో కాలం గడుపుతుంటే, మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తుపాను సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టిందని దేవినేని ఉమా తెలిపారు. సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, రాత్రింబవళ్లు అధికారులను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. సుమారు 40 వేల మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని, 84 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్నామన్నారు. ధాన్యం పంట నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు పెంచామని, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించామని తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేల తక్షణ సాయం అందిస్తున్నామన్నారు.

సంక్షేమంలోనూ ముందంజ

విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని దేవినేని ఉమా స్పష్టం చేశారు. కేవలం 27 నెలల్లోనే పింఛన్ల కోసం రూ.79 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 47 లక్షల మంది రైతులకు ఏటా రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటికే రూ.12,110 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. జగన్ ప్రభుత్వంలో రూ.1,700 కోట్ల ధాన్యం బకాయిలను కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వచ్చాక చెల్లించిందని గుర్తుచేశారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వంపై జగన్ చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

విశ్రమించేది లేదు : సీఎం

ఒకటి తరువాయి

కాకినాడ, ఏలూరు జిల్లాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించబడింది. అయితే, తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కోనసీమలో 316 గ్రామాలకు గాను 87, పశ్చిమ గోదావరిలో 318 గ్రామాలకు గాను 154 గ్రామాల్లోనే విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు జిల్లాల్లోనే ఇంకా 393 గ్రామాలకు విద్యుత్ అందించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 915 గ్రామాల్లో 867 గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించారు. మరోవైపు, దెబ్బతిన్న 1,045 మొబైల్ టవర్లలో 661 పనిచేయడం ప్రారంభించాయి. ఆర్‌అండ్‌బీ రహదారులపై కూలిన 2,270 చెట్లను తొలగించి, 137 చోట్ల నిలిచిపోయిన రాకపోకలను 119 చోట్ల పునరుద్ధరించారు.

భారీ నష్టం.. మరోవైపు జల సమృద్ధి

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, 16 జిల్లాల్లో 3,52,254 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఈ నష్టంపై వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నాయి. వారికి క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని వివరించి, గరిష్ఠంగా కేంద్ర సహాయం పొందేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒకవైపు ఇంత నష్టం జరిగినప్పటికీ, కురిసిన భారీ వర్షాలు రాష్ట్ర జల వనరులకు ఊహించని మేలు చేశాయి. అక్టోబర్ 26 నుంచి 29 వరకు కురిసిన వర్షాల వల్ల రాష్ట్రానికి సుమారు 380 టీఎంసీల నీరు లభించినట్లు అధికారులు అంచనా వేశారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా రాష్ట్రంలోని రిజర్వాయర్లలో అదనంగా 4.68 టీఎంసీల నీటిని నిల్వ చేయగా, మరో 5-6 టీఎంసీలు చేరే అవకాశం ఉంది. చిన్న నీటిపారుదల చెరువుల్లోకి 22 టీఎంసీల నీరు చేరగా, భూగర్భ జలాలు 44 టీఎంసీల మేర పెరిగాయి. రాబోయే ఐదు రోజుల్లో గొట్టా బ్యారేజీకి 16.24 టీఎంసీలు, మడ్డువలసకు 12.01 టీఎంసీల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం : చంద్రబాబు,లోకేశ్ దిగ్భ్రాంతి

రిటైర్డ్ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాలసుబ్రహ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ.. "బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకున్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. "నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించి ముక్కునూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మణ్యం గారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనా నైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటి వారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని లోకేశ్ నివాళులర్పించారు.

వీధుల్లో కాదు..పార్లమెంటులో తేల్చుకుందాం రండి!

ఒకటి తరువాయి

రాహుల్ గాంధీ అంగీకరించరని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చకు రావాలని సవాల్ విసిరారు. లక్నోలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. ఓట్ల దొంగతనం ఆరోపణలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాహుల్ గాంధీ ఈ అంశంపై పార్లమెంటులో చర్చించకుండా వీధుల్లో ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి ఆరోపణపైనా పార్లమెంటులో చర్చించాలని రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు సవాల్ విసిరారు. ఎన్నికల సంఘంపై వారు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని అమిత్ షా అన్నారు. చర్చకు బదులుగా నిరసనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల నిరసన

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు తమ నిరసనను తీవ్రతరం చేశాయి. ఆయనకు వ్యతిరేకంగా శనివారం బహిరంగ అభిశంసన కార్యక్రమం నిర్వహించాలని, ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన చేపట్టాలని ఇండియా కూటమి నేతలు ప్రణాళిక రూపొందించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శుక్రవారం నిర్వహించాల్సిన బహిరంగ అభిశంసన కార్యక్రమం అకాల వర్షాల కారణంగా వాయిదా పడింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బీజేపీకి ప్రయోజనం కలిగించేలా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సవరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చుతోంది.

కాంగ్రెస్, ఎస్పీలపై షా విమర్శలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడిన అమిత్ షా.. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నాయకత్వంపై విమర్శలు చేశారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తీరును ప్రస్తావించారు. రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తమ పార్టీలను అధికారంలోకి తీసుకురాలేకపోయారని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు ప్రతిపక్షాలు ఎన్నికల సంఘాన్ని తప్పుబడుతున్నాయని అన్నారు. మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత అంపైర్‌ను నిందించినట్లుగా, ఎన్నికల్లో ఓడిన తర్వాత ఓట్ల దొంగతనం ఆరోపణలు చేస్తున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు.

ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం చేయండి

ఒకటి తరువాయి

తెలుసు కుంటానని ప్రకటించారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులను వేగవంతం చేసి, నిర్మాణం వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తుపాను ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఇళ్లు, పంటలు, పడవలు, వలలకు జరిగిన నష్టాన్ని వేగంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని, తద్వారా బాధితులకు పరిహారం ఆలస్యం కాకుండా అందించాలని పవన్ ఆదేశించారు. వరద బాధితులకు 25 కిలోల బియ్యం, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందించాలని సూచించారు. సకాలంలో స్పందించి 92 తీరప్రాంత ఆవాసాల నుంచి 10,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

ఉత్తరాంధ్రకు కొత్త ఆశలు

ఒకటి తరువాయి

ప్రాంతానికి పారిశ్రామిక గుర్తింపు లభిస్తోందన్నారు. గతంలో ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కూడా ఉద్యోగాల కోసం ఇక్కడికి వచ్చే అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఒకవైపు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూనే, మరోవైపు పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎన్నో ఏళ్ల కల అని, గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ గోదావరి జలాలను తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రసిద్ధ ఉపమాక వెంకటేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. సంక్షేమ కార్యక్రమాల అమలులోనూ కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అనిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, స్త్రీశక్తి పథకం, అన్న క్యాంటీన్లు, మత్స్యకార సేవలో, నేతన్న సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో వంటి కార్యక్రమాల ద్వారా వివిధ వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు మూడు సెంట్ల స్థలం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జలజీవన్ మిషన్ ద్వారా వచ్చే వేసవి నాటికి ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు. తనకు ఏ విధంగా ఆదరణ, ఆశీర్వాదాలు అందించారో అదే విధంగా కూటమి అభ్యర్థులను కూడా ఆదరించాలని కోరారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై, జనసేన అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తుపై, బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు.

తుపాన్ బీభత్సం...విద్యుత్ శాఖకు భారీ నష్టం

ఒకటి తరువాయి

విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు తెలంగాణ నుంచి వెయ్యి మంది కార్మికులను రప్పించినట్లు తెలిపారు. తమిళనాడు ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరిపి అదనపు సిబ్బందిని తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. శుక్రవారం రాత్రికల్లా అన్ని మున్సిపాలిటీల్లో 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఒక్కో మున్సిపాలిటీకి ఒక సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించి, 250 మంది కార్మికులతో పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, మిగిలిన ప్రాంతాల్లోనూ సాధ్యమైనంత త్వరగా విద్యుత్ అందించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యవేక్షణతో పెను నష్టం తప్పింది : మంత్రి అచ్చెన్నాయుడు

అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దే పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్సిపాలిటీల పరిధిలో ఈ రాత్రిలోగా 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమలాపురంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఆయన తుపాను నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్నాబ్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచీ నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని చెప్పారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లకుండా ఆపడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. అయితే, విద్యుత్ శాఖకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని, జిల్లావ్యాప్తంగా సుమారు 8,000 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 36 సబ్‌స్టేషన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. గురువారం క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి... తక్షణమే తెలంగాణ నుంచి 1,000 మంది సిబ్బందిని రప్పించారని చెప్పారు. అలాగే, తమిళనాడు ప్రభుత్వంతో చర్చించి అక్కడి నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS"#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA"PH: 0866-2431422, 9346504777
"E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902